వేదాంతభేరి

ఫిబ్రవరి 2020 రూ. 10/-

ఓంకారేశ్వర జ్యోతిర్లింగము

Scanned by CamScanner



ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 53 ఫిబ్రవరి 2020 సంచిక : 02

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 2000/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు, విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :

శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.

Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ॐ **వేదాంతభేరి** ॐ

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 53 ఫిబ్రవరి 2020 సంచిక : 02

విషయ సూచిక

01. ప్రార్థన - 05

02. ఆయువు క్షయించక పూర్వమే సంసార సముద్రమును దాటవలెను
- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు -06

03. సాధన పంచకము - శ్రీ సంపూర్ణానందగిరిస్వాములవారు - 10

04. మహాశివరాత్రి - డా॥ సముద్రాల లక్ష్మణయ్య -14

05. భాగవతం షష్ఠ స్కంధము - శ్రీ మాతా పరావిద్యానందగిరి -18

06. మానవ జన్మ సుదుర్లభము - డా॥ ఎ.తారాలక్ష్మి - 21

07. ఉద్ధవ గీత - శ్రీ యేలేశ్వరపు హనుమ రామకృష్ణ - 24

08. నాట్య నమిత్తుండుని కథ - శ్రీమాతా గురుచరణానన్ద - 29

09. సాధన యందు దీక్ష - శ్రీరామకృష్ణ పరమహంస - 33

10. అందరూ కోరేది - శ్రీ కె. ఈశ్వర్ - 34

11. అద్వితీయ జ్యోతిర్లింగ క్షేత్రం - శ్రీకపిలవాయి లింగమూర్తి - 35

12. వార్తలు - 42

ముఖచిత్రం -

ఓంకారేశ్వర జ్యోతిర్లింగం

01-02-2020 శనివారం రథసప్తమి

05-02-2020 భీష్మైకాదశి

09-02-2020 మాఘ పూర్ణిమ - వ్యాసపూర్ణిమ

19-02-2020 శ్రీ రామకృష్ణ పరమహంస జయన్తి

21-02-2020 మహాశివరాత్రి

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

ఓం దేవాదిదేవ! దేవేశ! సర్వ ప్రాణభృతాం వర ।
ప్రాణినామపి నాథస్త్వం మృత్యుంజయ నమోఽస్తు తే ॥

దేహినాం జీవభూతోఽసి జీవో జీవస్య కారణమ్ ।
జగతాం రక్షకస్త్వం వై మృత్యుంజయ నమోఽస్తు తే ॥

హేమాద్రిశిఖరాకార సుధావీచిమనోహర ।
పుణ్డరీక ! పరంజ్యోతిః మృత్యుంజయ నమోఽస్తు తే ॥

ధ్యానాధార మహాజ్ఞాన సర్వజ్ఞానైకకారణ ।
పరిత్రాతాఽసి లోకానాం మృత్యుంజయ నమోఽస్తు తే ॥

త్వమోంకారోఽసి వేదానాం దేవానాం చ సదాశివః ।
ఆధారశ్శక్తి శ్శక్తీనాం మృత్యుంజయ నమోఽస్తు తే ॥

సోమసూర్యాగ్ని మధ్యస్థ వ్యోమవ్యాపిన్ సదాశివ ।
కాలత్రయ మహాకాల మృత్యుంజయ నమోఽస్తు తే ॥

వ్యోమ్ని త్వం వ్యోమరూపోఽసి తేజస్సర్వత్ర తేజసి ।
ప్రాణినాం జ్ఞాన రూపోఽసి మృత్యుంజయ నమోఽస్తు తే ॥

జగజ్జీవో జగత్ప్రాణః స్రష్టా త్వం జగతః ప్రభుః ।
కారణం సర్వతీర్థానాం మృత్యుంజయ నమోఽస్తు తే ॥

క్షయం కరోతి పాపానాం పుణ్యానామపి వర్ధనమ్ ।
హేతుస్త్వం శ్రేయసా నిత్యం మృత్యుంజయ నమోఽస్తు తే ॥

సర్వమాయా కళాతీత సర్వేంద్రియ పరావర ।
సర్వేంద్రియ కలాధీశ మృత్యుంజయ నమోఽస్తు తే ॥

త్వమేకో నిష్కళో లోకే సకలం భువనత్రయమ్ ।
అతి సూక్ష్మాతిరూపస్త్వం మృత్యుంజయ నమోఽస్తు తే ॥

త్వం యజ్ఞస్సర్వయజ్ఞానాం త్వం బుద్ధిర్బోధలక్షణా ।
శబ్దబ్రహ్మ త్వమోంకారో మృత్యుంజయ నమోఽస్తు తే ॥

(మార్కండేయకృతం మృత్యుంజయ స్తోత్రమ్)

Scanned by CamScanner

ఆయువు క్షయించక పూర్వమే సంసార సముద్రమును దాటవలెను

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

శాంతి సుఖములను కోరువాడు, జనన మరణ రూప దుఃఖదావాగ్నికి దూరముగనుండ దలంచినవాడు, బంధ విముక్తిని అభిలషించువాడు, దుర్భర నరక దుఃఖములకు వెరయువాడు జీవితమును సంస్కరించుకొని, దైవగుణములను ఆశ్రయించి అసుర గుణములకు తిలోదకము లివ్వవలసియున్నది. అయితే ఈ సిద్ధాంతము ఆచరణకు వచ్చునపుడు ప్రతిపక్షమువారగు రాక్షస గుణములనుండి జీవుడు గొప్ప తిరుగుబాటును ఎదుర్కొనవలసి వచ్చును. కోట్లకొలది జన్మల నుండి హక్కుభుక్తముల నేర్పరచుకొని బాగుగ తిష్ఠవేసియున్న ఆ కామక్రోధాది రాక్షసులు శాంతముగా వెడలిపోవుదురా? అసలు వెడలుటకు యిష్టపడుదురా? లేదు. తమ ప్రాణమునకే ఎసరు వచ్చినందువలన ఎంత గందరగోళము చేయవలెనో అంతచేసి వదలుదురు. ఇట్టి క్రాంతి నెదుర్కొనునపుడే సాధకులలో పెక్కురు దిగజారిపోవుదురు. సర్వేశ్వరుని యెడల అచంచలమైన విశ్వాసము, సాహసోపేతమగు బుద్ధి, ధైర్య స్థైర్యములు, గొప్ప పట్టుదల, కష్టసహిష్ణుత, లక్ష్యమును జేరవలెనను తీవ్రమగు ఆకాంక్ష ఉన్నవారు మాత్రమే ఈ యుద్ధమున విజయమును జేపట్టుదురు.

పాఠశాలలో విద్యార్థులు త్రాడులాగు పందెములో పాల్గొనుచుందురు. ఒకే త్రాడును ఒకవైపు కొందరు,మరియొక్కవైపు కొందరు పట్టిలాగుచుందురు. ఎవరివైపు త్రాడు ఎక్కువగా జరుగునో వారు గెలుపొందినట్లు. అట్లే ప్రతి ముముక్షువు యొక్క హృదయమందును

దైవాసుర సంగ్రామము జరుగుచునే యున్నది. మంచికి చెడ్డకు, ధర్మమునకు అధర్మమునకు, న్యాయమునకు అన్యాయమునకు, దైవసంపదకు అసుర సంపదకు ఘోరమగు యుద్ధము సంభవించుచునే యున్నది. కేవలము అజ్ఞానియగువాని యొక్కయు, కేవలము జ్ఞానియగువాని యొక్కయు హృదయమందు మాత్రము ఈ సంగరముండదు. ఏలయనిన అజ్ఞాని మనంబున ఒకేఒక పక్షము (అసురపక్షము) కాపుర ముండును. రెండవ పక్షమగు దైవత్వమును గూర్చిన వాంఛయే వాని కుండదు. ఇక జ్ఞానియో ప్రతిపక్షమగు అసురత్వమును రూపుమాపి యుండుటచే ఒకేఒక దైవపక్షముమాత్ర మతనియందుండును. ఇక మధ్యగల జిజ్ఞాసువునకు మాత్రమే, ముముక్షువునకు మాత్రమే ఈ యుద్ధ ప్రసక్తి కలుగును. కాబట్టి సాధకుడు అతిజాగరూకుడై ప్రయత్న పూర్వకముగ గొప్ప ఆధ్యాత్మిక బలమును చేకూర్చుకొనవలెను. నీటిలో కుండను పెట్టినచో నీటియందు గుంటగా ఏర్పడును. కాని ఆ కుండను పైకితీయగనే ఆ గుంట తత్క్షణమే పూడిపోవును. నీరు తనయందు గుంటలను సహింపదు. అట్లే ముముక్షువు తన యంతఃకరణమును బాగుగ పరిశీలించి, దానియందేవైన గుంటలు ఉన్నచో, దోషములున్నచో వెనువెంటనే విచారణాదులచే వానిని తొలగించుకొని హృదయము సమముగ, నిర్మలముగ నొనర్చుకొనవలెను.

'నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మాద్బ్రహ్మణి తే స్థితాః' అనునట్లు, ఎపుడు చిత్తము దోషరహితమై, సమమై వెలయునో అపుడు వారు బ్రహ్మమందు స్థితినొందియున్నవారే యగుదురు. ఏలయనగా బ్రహ్మము సమ రూపమును, దోషవర్జితమును అయియున్నది. జీవుడు తన యంతః కరణమును శుద్ధమొనర్చుటయందే విలంబముగాని, మోక్షమును పొందుట యందుగాదు. హృదయనైర్మల్యస్థితి ఏర్పడినప్పుడు మోక్షము త్రుటి కాలములో లభించును.

ఫోటోతీయుట ఏమంత ఆలస్యముగాదు, సెకండులోని నూరవభాగమంత కాలము దానికి చాలును. కాని ఆలస్య మంతయు కుర్చీలు సర్దుటలోను, బెంచీలు సరిచేయుటలోను, ముఖ వైఖరులను సరిదిద్దుటలోను జరుగుచుండును. మోక్షావశ్యకమగు ఇట్టి చిత్తశుద్ధి జీవునకు కలిగించు నిమిత్తమే శ్రీకృష్ణభగవానుడు గీతయందు పూర్ణముగ ఒక అధ్యాయమంతయు (16 అధ్యా) దాని క్రింద వినియోగించి విధినిషేధముల రెండిటిని అద్దాని యందు ప్రతిపాదించి వేసెను. అదియే దైవాసుర సంపద్విభాగయోగము. దైవసంపద విధి. అసురసంపద నిషేధము. దేనిని వదలించుకొనవలెనో, దేనిని గ్రహించవలెనో రెండిటిని జీవుడు తెలిసికొని యుండినచో మంచిదని యెంచి గీతాచార్యుడు ఆ విధి నిషేధముల రెండిటిని ఆచట పొందుపఱచెను.

భగవానుడు చూపిన ఈ మార్గముద్వారా జీవునకిక మోక్ష ప్రయాణము సులభతరమైపోగలదు. తన హృదయ కవాటముయొద్ద రాత్రింబవళ్లు కావలి కాయుచు శత్రుపక్షమువారిని లోనికిరానీయక, ఆత్మీయులను మాత్రము రానిచ్చుచుండినచో అచిర కాలములో దేహము దేవాలయమై తనరగలదు. జీవుడే దైవుడై చెన్నొందగలడు. నిరోధింపబడిన శత్రువు తిరుగబడినచో సంఘర్షణ గావించి, పోరుసలిపి, బుద్ధిబలము నుపయోగించి ఎట్టైనను లోనికి రానీయకుండ చేయుటయే జీవుని కర్తవ్యము. తన మనస్సుతో ఘర్షణ పడువానికి ప్రపంచములో నెచటను ఘర్షణ యుండనేరదు. అభ్యంతర శాంతి నొందినవానికి బాహ్యశాంతి దానియంతటనదియే వచ్చి చేరును. కాబట్టి ఉత్తముడగువాడు తన మనస్సులోని మలినభాగముపై యుద్ధ ప్రకటనగావించి దైవసంపద్రూప తీక్షణాయుధములచే అద్దానిని హతమార్చి కేవలము శుద్ధభాగమే శేషించు

లాగున నొనర్చినచో, ఇక మోక్షలక్ష్మి వానిని వెతకికొనుచువచ్చి మెడలో పూల హారము వేయును.

"సత్త్వపురుషయోః శుద్ధిసామ్యే కైవల్యమ్" (పతంజలియోగ సూత్రము) 'ఆత్మ ఎంత శుద్ధముగ నున్నదో మనస్సున్ను అంత శుద్ధత్వము నొందినచో అట్టి స్థితియే మోక్షమని చెప్పబడునని పతంజలి మహర్షి నుడివి యున్నాడు. కావున పరమార్థసాధనకై త్వరపడవలెను. ఆయువు క్షయింపక పూర్వమే, దేహనౌక భగ్నముకాక పూర్వమే ఈ సంసార మహాసముద్రమును దాటివేయవలెను. దీపమున్నపుడే యిల్లు చక్కబెట్టుకొనవలయును. సంసార సంగ్రామమున ప్రణవ పతాకమును జేపట్టి వివేకమను తీక్షణ ఖడ్గము యొక్క ధవళధారలచే దంభదర్పాద్యసుర సమూహమును ఛేదించివైచి, అభయత్వాది దేవతాగణము నాదరముతో హృదయగుహలోనికి ఆహ్వానించి, సత్కరించి నిరతిశయాత్మానందామృతమును గ్రోలి తమ జీవితములను పునీతమొనర్చుకొనవలెను.

ఆరాధనోత్సవాలు

గురుదేవులు పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి 22వ ఆరాధనోత్సవాలు శార్వరినామ సంవత్సరం చైత్రశుద్ధ చతుర్దశి నుండి బహుళ తదియ వరకు జరుగును. అనగా 2020వ సంవత్సరం ఏప్రిల్ నెల 7,8,9,10 తేదీలలో జరుగనున్నది. 7వ తేదీ ఆరాధన, 10వ తేది జన్మదినోత్సవము వచ్చును.

ఇట్లు

ఆశ్రమ పరిపాలనా సంఘము

సాధన పంచకము

– శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

(గత సంచిక తరువాయి)

పవిత్రాత్మ స్వరూపులునగు ప్రియాత్మ బంధువులారా !

ప్రథమ శ్లోకమును వివరించుకొనుచున్నాము

“పాపౌఘః పరిధూయతామ్” పాపములను పరిహరించుకొనవలయును. అనగా పాప సమూహమును తుడిచి వేయవలెను. పాపమనగా వేద నిషేధ కర్మలునాచరించుటచే గలుగు ఫలమును పాపమందురు. వేద నిషేధ కర్మలనగా – మాహింస్యాత్సర్వా భూతాని, మా సురాపానం పిబేత్, మా కలంజం భక్షయేత్’ ఇత్యాదులు. ఉదాహరణకు ఒకటి వివరించుకొందము. “మా హింస్యా త్సర్వాభూతాని” – ఏ కాలములోనైన, ఏవిధముగానైనను ఏ ప్రాణిని హింసింపరాదు. అనగా వాక్కు ద్వారా (నోటిచేత) ఇతరులను కఠినమైన మాటలతో, వారు దుఃఖమును పొందునట్లుగా దూషింపరాదు. శరీర సంబన్ధమైన చేతులతో, కాళ్లతో తన యిచ్ఛానుసారముగా కొట్టరాదు, మనస్సుతో ఇతర జీవులను ఏవిధముగానైనను హింసించాలనే భావన యుండగూడదు. మరియు ఇతరులు చెడిపోవాలనే దుష్ట ఆలోచనలుండరాదు. రాగద్వేష పూరితమై తన మాట సాగడం లేదని, తనకు గౌరవం లేదని, దుష్టమైన ఆలోచనతో ఇతర జీవులను తిట్టికొట్టి వారిని బాధపెట్టినందువలన వచ్చు ఫలమును పాపమందురు. ఇవి శాస్త్ర విరుద్ధమైన పనులు. సదాచార సంపత్తిగల శాస్త్రములను చదువక, గురువుల ద్వారా, తల్లిదండ్రుల ద్వారా శిక్షింపబడని వారికే ఈలాంటి పనులయందు ప్రవృత్తి గలుగును.

కావున గురువులు, ప్రాజ్ఞులు, తల్లిదండ్రులు చెప్పిన మాటలు

శ్రద్ధగా విని సచ్ఛాస్త్రములు ప్రతిదినం చదువుచూ, వివేకము సంపాదించిన, పాపపు పనుల నుండి విముఖులై పాపపు పనులు చేయరు. పాపము వలన మనశ్శాంతి ఉండదు, శారీరక రోగములు ఎక్కువగును. ఇతరులచే అవమానింపబడెదరు. అధర్మ ప్రవృత్తి యందే మనస్సు ఆలోచించుచుండును. ఏ పనిచేసినా పనికితగిన ఆదాయముండదు. రాబడి తక్కువ, ఖర్చులు ఎక్కువ. తనమాట ఎవరూ వినరు. ఇటువంటి జన్మలను పొందుదురు. ఆత్మానాత్మ వివేకమును పొందు సామర్థ్యముండదు. ఈ పాపమునే మలదోషమందురు. పాప నివారణకు సాధన–తాను చేసిన చెడు పనులకు పశ్చాత్తాపమును జెంది, మంచి పనులు చేయుచూ తత్ఫలమును భగవంతునికి సమర్పిస్తూ, సదా భగవన్నామమును జపించుచుండిన పాపము శీఘ్రముగా తొలగును. పవిత్రుడగును, సదాచారుడగును, దైవానుగ్రహమునకు పాత్రుడగును. ఉదాహరణకు –వాల్మీకి పూర్వనామధేయము రత్నాంగుదుడు. ఇతరులను హింసించి ధనసంపాదన చేయుచు దొంగగా, పాపిగా ప్రసిద్ధి చెందెను. నారద మహర్షి చెప్పిన నీతివాక్యములచే, వారి మంత్రోపదేశముచే, చెడు పనులు మాని రామనామమును జపించి పాపమును పోగుట్టుకొని (పశ్చాత్తాపము నొంది) వాల్మీకి మహర్షిగా, ఆది కవిగా ప్రసిద్ధి చెందెను. రామాయణము రచించి ప్రపంచ ప్రసిద్ధిని చెందెను. ‘జపతోనాస్తి పాతకమ్” అని సూక్తి. ‘యజ్ఞానాం జపయజ్ఞోస్మి ’ అని గీత. మానవుడు పవిత్రుడు కావడానికి, పరమార్థజ్ఞానమును సంపాదించుటకు ముఖ్యమైన సాధన ఇది.

“భవసుఖే దోషోఽనుసన్ధీయతామ్ ”

జన్మమృత్యు స్వరూపమగు సంసారమునందు మానవుడు అనుభవించిన సుఖము ఎటువంటిదో, దాని కోసమై శ్రమ ఎంత

Scanned by CamScanner

కఠినమైనదో, "సుఖమల్పం బహుక్లేశమ్" సుఖ దుఃఖములయొక్క తారతమ్యమును అనుసంధానము చేయవలెను. విచారణ చేయవలెనని భావన. శ్రీ జగద్గురు శంకరాచార్యులవారు వేదాంత డిండిమలో ఈ క్రింది విధముగా చెప్పియున్నారు. "సుఖమల్పం బహుక్లేశం విషయ గ్రాహిణాం నృణామ్। అనంతం బ్రహ్మనిష్ఠానామితి వేదాన్తడిండిమః॥" సుఖదుఃఖములు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములగు విషయముల వలన కలుగును. ఇంద్రియములకు విషయములతో సంబంధపడినపుడు అనుకూల విషయమైతే సుఖము, ప్రతికూల విషయములైతే దుఃఖము కలుగును. పుణ్యఫల ప్రారబ్ధము అనుభవించునపుడు అనుకూల విషయ వస్తువులు ప్రాప్తమగును. తద్వారా సుఖము (ను పొందును) కలుగును. పాపఫల ప్రారబ్ధముననుభవ సమయంలో ప్రతికూల విషయ వస్తువులు గలుగును. తద్వారా దుఃఖము కలుగును. మన మాచరించే శుభకర్మలచే పుణ్యము గలుగును. నిషిద్ధములగు అశుభకర్మలనాచరించుటచే దుఃఖం కలుగును. ధర్మాధర్మముల వలన పుణ్యపాపములు గలుగును. పుణ్య పాపముల వలన సుఖదుఃఖములు, అనుకూల, ప్రతికూల విషయ వస్తువులు కలుగును. ప్రతిదినం విచారణ చేసినపుడు సంసార సుఖములో నున్న దోషములు తెలియును. వాటి విచారణ మత్యంతావశ్యకము.

విషయ సుఖములు క్షణికములు. ఉదాహరణకు మంచి వస్తువులన్నీ వేసి విశేషముగా లడ్డుచేసి, తినడానికి నోటి ముందు పెట్టుకొని ఎంతసేపు ఉంచిన తృప్తి కలుగదు. పూర్తిగా మ్రింగిన తరువాతను ఆనందముండదు. నాలుకపై ఆ వస్తువున్న క్షణమే ఆనందము. ఆనందమని మ్రింగకుండ నాలుకపై ఎంత సమయముంచగలము. ఉంచితే ఉన్న రుచి పోతుంది. కనుకనే ఈ సుఖమును క్షణికమన్నారు. ఇంద్రియానికి, విషయానికి సంబంధమున్నంత వరకే సుఖముండును. ఈ విధంగా చెవికి అనుకూల

శబ్దముల వలన సుఖము, ప్రతికూల శబ్దముల వలన దుఃఖము గలుగును. ఈవిధంగానే జిహ్వేంద్రియమునకు రుచికరములైన వస్తువులు తినుటవలన ఆనందము, రుచిలేని పదార్థముల వలన దుఃఖములు గలుగును. మిగతా విషయములన్నియు నీ విధముగానూహించవలెను. ప్రపంచములోనున్న పదవీ సుఖములు క్షణిక సుఖములే. "భోగే రోగభయమన్నారు" పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు. 'భోగముపై ఆశపడకన్న' అని అన్నారు. "మాత్రాస్పర్శాస్తు కౌన్తేయ శీతోష్ణ సుఖదుఃఖదాః ఆగమాపాయినోఽ నిత్యా తాన్స్తితిక్షస్వభారత" అని శ్రీకృష్ణ పరమాత్మ చెప్పారు. స్వర్గలోక సుఖములు గూడ భయముతో గూడినవే. హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడు, మహిషాసురుడు, రావణాసురాది వారిని చూసి దేవతలు భయపడుచుందురు. కావున విషయసుఖములనిత్యములు శాశ్వత శాంతినివ్వలేవని విచారించి దోష దృష్టినారోపించి ఆత్మ విజ్ఞానమును పొంది శాశ్వత సుఖమును పొందుటయే మానవ జన్మ ముఖ్యలక్ష్యమని ఈ సాధన చెప్పుచున్నది. (సశేషం)

శ్రీ శుకబ్రహ్మాశ్రమం వారి భక్త కన్నప్ప త్రినేత్ర వైద్యాలయం ఆసుపత్రిలో
2019 సంవత్సరములో

1. ఓ.పి. విభాగంలో **10680** మందికి కంటి పరీక్షలు చేయబడి తగు చికిత్సలు జరిగినవి.
2. సర్జరీ విభాగంలో **945** మందికి కళ్ళలో పొరలు ఉచితంగా తీయబడి కళ్ళలో లెన్సు అమర్చబడినవి.
3. **719** మందికి ఉచితంగా కళ్ళద్దాలివ్వబడినవి.
4. **63** మందికి ఉచితంగా యాగ్ లేజర్ చికిత్స చేయబడినది.
5. **37** గ్రామాలలో కంటి వైద్య శిబిరాలు నిర్వహింపబడినవి.

Scanned by CamScanner

మహాశివరాత్రి

- డా॥ నముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

మాఘమాసంలో వచ్చే విశిష్ట దినాలలో సర్వశ్రేష్ఠమైనది "మహాశివరాత్రి". మాఘ బహుళ చతుర్దశి నాడు ఈ పండుగను జరుపుకొంటాం.

పండుగ దినాలలో సామాన్యంగా ఇష్ట మృష్టాన్నాలు భుజిస్తాం. కాని శివరాత్రి ఉపవాస ప్రధానమైన పండుగ. ఈ దినమంతా పగలు ఉపవాసముండి రాత్రి జాగరణం చేయాలి. శివలింగాన్ని అర్చించాలి. ఇలా చేస్తే ఇది ఫలప్రదమవుతుందని పురాణాలు, వ్రత గ్రంథాలూ చెబుతున్నాయి.

రాత్రి నాలుగు జాములలోనూ మొదటి జాములో క్షీరంతోనూ; రెండవ జాములో పెరుగుతోనూ, మూడవ జాములో నెయ్యితోనూ, నాల్గవ జాములో తేనెతోనూ శివలింగాభిషేకం చేయాలని వ్రత విధాయక గ్రంథాలు నిర్దేశిస్తున్నాయి. వీలైనవాళ్ళు ఈ అభిషేకాలను ఇంటిలోనే జరుపుకోవచ్చు. అలా కానివాళ్ళు శివాలయాలలో జరిగే అక్కడి పూజలో పాల్గొనవచ్చు.

"అలంకార ప్రియోవిష్ణు రభిషేక ప్రియః శివః" అన్నట్లు విష్ణువును అలంకారాలతోనూ, శివుణ్ణి అభిషేకంతోనూ సంతుష్టుణ్ణి చేయాలని గ్రహించాలి.

శివరాత్రికి పూర్వ దినాన ఒక్కపూట మాత్రమే భుజిస్తారు. శివరాత్రి నాడు అరుణోదయ కాలానికి ముందే స్నానం చేస్తారు. ఆలయానికి పోయి శివుణ్ణి దర్శిస్తారు. రాత్రి జాగరణం చేస్తూ నాల్గు జాములలో నాల్గుసార్లు

లింగాన్ని అర్చిస్తారు.

ఐదు రకాల శివరాత్రులు : ఒక సంవత్సర కాలంలో ఐదు రకాల శివరాత్రులు సంభవిస్తాయి. (1). నిత్య శివరాత్రి 92). పక్షశివరాత్రి, (3). మాసశివరాత్రి (4). మహాశివరాత్రి మరియు (5). యోగ శివరాత్రి అని.

ప్రతినిత్యమూ శివారాధన కావించేది నిత్య శివరాత్రి. పక్ష పక్షానికి చేస్తే పక్ష శివరాత్రి. ప్రతి నెలలో శివారాధన చేస్తే అది మాస శివరాత్రి.

మాఘ బహుళ చతుర్దశి నాడు అనుష్ఠించేది మహాశివరాత్రి. యోగి యోగ ప్రభావంతో యోగనిద్ర చేస్తే అది యోగ శివరాత్రి అవుతుంది.

శివుడు మహాశివరాత్రినాడు దివ్యతేజంతో లింగాకారంతో జనిస్తాడు. అర్ధరాత్రి సమయంలో లింగోద్భవం జరుగుతుంది. అందువల్ల రాత్రి కాలంలో శివపూజ జరగడం ఇందలి విశిష్టత. పూజ రాత్రి 8 గంటలకు ప్రారంభించి మరునాటి ఉదయం 5 గంటలకు సమాప్తం చేస్తారు.

మహాదేవుడుగా ప్రఖ్యాతుడైన శివుని ద్వాదశ జ్యోతిర్లింగాలు సుప్రసిద్ధాలు. (1). మహాబలేశ్వరం (2). ఉజ్జయిని (3) సోమనాథం (4). భీమశంకరం 5). నాగనాథం (6) వైద్యనాథం (7). త్రియంబకం, (8).రామేశ్వరం (9) మల్లికార్జునం (10). పరమేశ్వరం (11) కేదారం (12). ఘృష్ణేశం. ఈ క్షేత్రాలన్నింటిలోనూ మహాశివరాత్రినాడు విశిష్ట విధానంతో పూజలు జరుగుతాయి. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొంటారు.

మహాశివరాత్రి: లింగోద్భవానికి హేతువుగా ఈ క్రింది కథను గూడా చెప్పడం కద్దు. బ్రహ్మ, విష్ణువు, శివుడు త్రిమూర్తులుగా ప్రసిద్ధులు. సృష్టి స్థితి లయాలు వీరివల్ల సంభవిస్తాయి.

ఒకసారి బ్రహ్మ, విష్ణువు, 'తమలో ఎవరు గొప్ప ' అనే విషయంలో

Scanned by CamScanner

తగాదా పడ్డారు. అప్పుడు శివుడు అర్ధరాత్రి సమయంలో లింగాకారంలో వారి ఎదుట ప్రత్యక్షమైనాడు. అది చూడగానే వారికి ఆశ్చర్యం కలిగింది. ఆ లింగం ఆద్యంతాలను వారు తెలుసుకోలేకపోయారు. చివరికి ఆ లింగం కంటే తాము తక్కువ వారమనే అవగాహనకు వచ్చి శాంతించారు.

బ్రహ్మ విష్ణువులు అర్ధరాత్రి వేళ ఆ లింగాన్ని భక్తి శ్రద్ధలతో పూజించారు. అప్పటి నుండి ఆ రాత్రి మహాశివరాత్రిగా ప్రసిద్ధి పొందింది. శివుని విశిష్టత అట్టిది. అందువల్లనే "శివాత్పరతరం నాస్తి" (శివునికంటె గొప్పది లేదు) అన్న సూక్తి ప్రచారంలోకి వచ్చింది.

శివరాత్రి నాడు చేసిన జాగరణం వల్లా, ఉపవాసం వల్లా, పూజల వల్లా కలిగే ఫలాలను గూర్చి వివరించే పలు కథలు 'శివపురాణం' మొదలైన గ్రంథాలలో ఉన్నాయి. జిజ్ఞాస గలవారు వాటిని చదివి తెలుసుకోవచ్చు.

ఈ మహాశివరాత్రి పర్వదినం ఎంతకాలం నుండి విశిష్ట దినంగా ఆచరింపబడుతున్నదో నిర్ణయించడం కష్టం. మహాభారతంలో ఒకచోట ఈ పర్వ ప్రస్తావన వస్తుంది. గరుడ పద్మాది పురాణాలలో దీని ప్రసక్తి అధికంగా కనిపిస్తుంది. కొన్ని శిల్పాలను బట్టి చూస్తే దాదాపు రెండువేల అయిదు వందల సంవత్సరాలకు పూర్వమే ఈ మహాశివరాత్ర్యుత్సవం ప్రారంభమైనట్లు తెలియవస్తున్నది.

కల్యాణోత్సవం: ఈ పర్వదినాన్ని పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవ దినంగా గూడా భావించి కల్యాణోత్సవాలు నిర్వహిస్తారు. శివుడానాడు తాండవ నృత్యం చేస్తాడని ప్రతీతి కలదు.

అంతేకాదు. మహాశివరాత్రి నాడు శివుడు అన్ని లింగాలలోనూ ప్రవేశించి వుంటాడని భక్తులు విశ్వసిస్తారు. అందుచేత ఈ దినాన ఎక్కడ

శివలింగపూజ చేసినా పాప విమోచనం కల్గుతుందని నమ్మకం.

త్రిలింగ దేశం : మన తెలుగు నేలలో శ్రీశైలం-మల్లికార్జునస్వామి, దాక్షారామ -భీమేశ్వరస్వామి, కాళేశ్వరంలోని కాళేశ్వరస్వామి -అనే శివ స్వరూపాలే ఈ నేలకు (త్రిలింగ - తెలుగు) తెలుగుదేశం అనే పేరు రావడానికి కారణాలు.

అంతేకాదు శ్రీకాళహస్తి, శ్రీశైలం, వేములవాడ, కాళేశ్వరం, కోటప్పకొండ మున్నగు శైవ క్షేత్రాలలో విశేషంగా శివరాత్ర్యుత్సవాల నిర్వహణ జరుగుతుంది. ఈ ఉత్సవాలు ప్రజల ఆత్మోన్నతికి సహకరిస్తాయి.

పంచభూత లింగాలు: చిదంబరంలో ఆకాశలింగం, శ్రీకాళహస్తిలో వాయులింగం, అరుణాచలంలో అగ్నిలింగం, జంబుకేశ్వరంలో జలలింగం, కంచిలో పృథ్వీలింగం పంచభూత లింగాలుగా విఖ్యాతి పొందాయి. అన్నీ సుప్రసిద్ధ పుణ్యక్షేత్రాలే.

శ్రీకాళహస్తి దక్షిణకైలాసంగా పేరుగాంచింది. కలియుగ వైకుంఠమైన తిరుమలకు సమీపంలోనే ఈ శైవక్షేత్రం నెలకొనడం విశేషం.

శ్రీకాళహస్తి - తిరుపతి క్షేత్రాల మధ్య వెలసిన వ్యాసాశ్రమాన్ని బ్రహ్మవిద్యా ప్రచార కేంద్రంగా శ్రీమలయాళస్వాములవారు తీర్చిదిద్దారు. శివుడు జపాలాదేవి తపస్సుకు మెచ్చి ఉత్తారకేశ్వర నామంతో ఆవిర్భవించి ఆమెకు అనుగ్రహించాడని శివ పురాణంలో చెప్పబడియున్నది. అలా ఆ దేవుడు ఆవిర్భవించిన క్షేత్రమే శ్రీవ్యాసాశ్రమంగా రూపొందడం ఆనంద దాయకం. శివకేశవ భేదాన్ని పాటించకుండా సర్వత్రా సమన్వయాన్ని పాటిస్తే అందరికీ ఆత్మోన్నతి సిద్ధిస్తుంది.

పవిత్రంగా నిస్స్వార్థంగా ఉండడానికి ప్రయత్నించు.

భాగవతం షష్ఠ స్కంధము

– శ్రీ మాతా పరావిద్యానందగిరి

(డిశంబరు సంచిక తరువాయి)

శ్రీ మద్భగవద్గీతలో శ్రీ కృష్ణపరమాత్మ ఈ శరీరమును క్షేత్రంగా అభివర్ణించారు. పుణ్య, పాపముల రెండింటిని పండించుకొను అవకాశమునిచ్చునది గనుక ఇది క్షేత్రము. మంచి మొక్కలు పెరగడానికి చాలా కృషి చేయవలసి వస్తుంది. కలుపు మొక్కలు మాత్రము ఏ ప్రయత్నమూ లేకుండానే వృద్ధి చెందుతుంటాయి. అదేవిధంగా పాపములు ఏ ప్రయత్నమూ లేకుండానే మనోవాక్కాయముల ద్వారా జరిగిపోతూ వుంటాయి. కాని పుణ్యము కోసం అంతకంటె ఎక్కువ పురుషార్థమైన మోక్షం కొఱకు శ్రమపడవలసి వున్నది. కనుక మానవుడు తన ప్రయత్నముతో యమధర్మరాజు బారిన పడకుండా తనను తాను రక్షించుకోవాలి. అందులకే పరమాత్మ.

"ఉద్ధరేదాత్మనాత్మానం" అని అన్నారు. ఇంతటితో పరమపాపియైన అజామిళుడు ఏవిధంగా "నారాయణ" స్మరణతో ఉద్ధరింపబడినాడో వివరించు ఆతని చరిత్ర పూర్ణమైనది. నాల్గవ అధ్యాయము ప్రారంభమయినది. పరీక్షన్మహారాజు సృష్టియొక్క విస్తృతిని గురించి, మరియు కారణ కారణుడైన భగవంతుడు ప్రతికల్పములో తన శక్తిద్వారా ఏవిధముగా విశ్వరచన గావించుచున్నారో తెలుపవలసినదిగా కోరగా శ్రీశుకమహర్షి తెలుపుచున్నారు.

ప్రాచీన బర్హి అను మహారాజు నారదోపదేశము వలన నివృత్తి మార్గపరుడై వుండెను. ఈతని భార్య సముద్రి (సౌవర్ణి). అతనికి

ప్రచేతసులను పదిమంది కుమారులు గలరు. వారు సముద్ర గర్భమున తపమాచరించి దాని నుండి వెల్వడి తన తండ్రియొక్క నివృత్తి మార్గపరత్వము వలన భూతలమంతా విస్తృతముగా తీరుతెన్ను లేక వ్యాపించియున్న చెట్లు చేమలను చూచి కోపగించుకొనిరి. వారు తమ తపోమహిమచే తమ ముఖములనుండి అగ్నిని, వాయువును సృష్టించి వృక్షములను కాల్చివేయుచుండిరి.

అది చూచిన ఓషధుల (వృక్షముల)కు అధిపతియైన చంద్రుడు వారి కోపమును శాంతింపజేయుటకు ప్రయత్నించుచూ ఈ విధముగా అనెను.

ఓ ప్రచేతసులారా! మీరు ప్రజలకు ప్రభువులు. ఈ చెట్లు, చేమలపై మీరు జాలి వహించవలయును. ప్రజాపతులకు అధిపతియైన శాశ్వతుడైన శ్రీహరి ప్రజలకు అన్నపానాదులొసగుటకు ఈ వృక్షములను సృష్టించెను.

"అన్నం చరాణామచరా వ్యాపదః పాదచారిణామ్ ।

అహస్తా హస్తయుక్తానాం ద్విపదాం చ చతుష్పదః ॥

భూమి మీద సంచరించు జంతువులకు పాదములు లేని (చెట్లను పాదపములు అంటారు. ఎందుకంటె పెద్ద చెట్లకు చుట్టూ నీరు నిలవడం కొరకు త్రవ్వుతారు, వాటిని పాదులు అంటారు. అవి ఉన్నవి కనుక పాదపములు అంటారు. అవి లేనివి గడ్డి మొక్కలు అపదలు, అంటే పాదములు లేనివి అని అర్థం) గడ్డి మొదలయిన ఆహారములు, రెండు చేతులు, కాళ్ళు గల మానవులకు ఆహారమైన ధాన్యాదులు, ఆకాశమున ఎగిరే పక్షులకు కూడా వృక్షముల ఫలములు, ధాన్యములే ఆహారము. శ్రీహరి మీ తండ్రిని ప్రజాసృష్టి చేయుటకు ఆదేశించిరి. ప్రజాసృష్టికి

Scanned by CamScanner

హేతుభూతమైన ఆహారమునిచ్చు వృక్షములను నశింపజేయుట సమంజసము కాదు.

"లోకానాం పితరౌ బంధూ దృశః పక్ష్మ స్త్రియాః పతిః ।
పతిః ప్రజానాం భిక్షూణాం గృహ్యజ్ఞానాం బుధః సుహృత్ ॥

లోకము నందు తల్లిదండ్రులు పిల్లలను, కంటి రెప్పలు నేత్రములను, భర్త భార్యను, గృహస్థులు భిక్షుకులను, జ్ఞాని అజ్ఞానులను, రాజు ప్రజలను కాపాడుచూ వారి హితమునకై పాటుపడుచుందురు.

"యస్సముత్పతితం దేహే ఆకాశాన్మన్యు ముల్బణమ్ ।
ఆత్మజిజ్ఞాసయా యచ్ఛేత్ స గుణా నతి వర్తతే ॥"

ఎవడు తన హృదయాకాశమున ఉప్పొంగు భయంకరమైన కోపమును ఆత్మ విచారము ద్వారా జయించగలుగునో ఆతడే త్రిగుణాతీతుడు కాగలడు. భగవంతుడు సకల ప్రాణుల హృదయములలో ఆత్మ రూపమున విరాజిల్లుచున్నాడు. మూగజీవులైన వృక్షములను దహించుట ఆపివేయుడు, మీకు మేలగును.

ఇట్లు హితబోధ చేసిన చంద్రుడు ప్రమ్లోచ అను అప్సరస కుమార్తె, వృక్షములచే పోషింపబడిన మారిష అను కన్యను వారికి ఇచ్చి వెడలిపోయెను. ప్రచేతసులు ఆమెను ధర్మపత్నిగా స్వీకరించి దక్షుని కొడుకుగా పొందినారు. (సశేషం)

<u>గృహ వైద్యం :</u> శొంఠిని దోరగా వేయించి కొద్దిగా సైంధవ లవణం కలిపి ఆ చూర్ణాన్ని వేడి వేడి అన్నంలో నెయ్యితో కలిపి తింటే కడుపు నొప్పి, కడుపు ఉబ్బరం తగ్గుతుంది. ఉలవలు బాగా ఉడికించి పైన తేరిన నీటిలో మిరియాల చూర్ణం సైంధవ లవణం కలిపి తాగితే కడుపు నొప్పి తగ్గుతుంది.

మానవ జన్మ సుదుర్లభము

-డా॥ఎ. తారాలక్ష్మి, M.A., M.Ed.,Phd.,(శ్రీకాళహస్తి)

శ్లో॥ జన్తూనాం నరజన్మ దుర్లభమతః పుంస్త్వం తతో విప్రతా
తస్మాద్వైదిక ధర్మమార్గపరతా విద్వత్వ మస్మాత్పరం ।
ఆత్మానాత్మ వివేచనం స్వానుభవో బ్రహ్మాత్మనా సంస్థితిః ।
ముక్తిర్నో శతకోటి జన్మ సుకృతైః పుణ్యైర్వినా లభ్యతే ॥

జనన మరణ రూప సంసార చక్రభ్రమణములో పరిభ్రమించు జీవులు ఉత్తమ, అధమ, మరియు మధ్యమ దేహాలను పొందుటకు వారు గత జన్మలలో చేసుకున్న పుణ్య పాప మరియు మిశ్రమ కర్మలే మూలకారణము. కర్మ స్వరూపమును తెలియజేయునది బుద్ధి. పరబ్రహ్మ మానవులకు మాత్రమే ప్రసాదించిన వరం సదసద్వివేచనాశక్తి గల బుద్ధి. బుద్ధి బలంచేత మానవుడు మంచి, చెడులను తెలిసికొనగలడు. మంచిని చేపట్టి చెడును విసర్జించి వాటి ఫలితములను పొందగలడు. కనుకనే ప్రాణికోట్లలో నరజన్మ అత్యంత దుర్లభమైనదిగా జగద్గురువులు శ్రీ ఆదిశంకరులు వివేక చూడామణి గ్రంథములో వివరించారు.

దుర్లభమైన ఈ మానవజన్మయొక్క పరమ లక్ష్యము జీవించి యుండగనే ముక్తిని పొందడమే. ఈ లక్ష్యమును చేరుటకై సాధకుడు అధిరోహించవలసిన సోపానములను జగద్గురువులు పై శ్లోకములో పేర్కొన్నారు.

ఉత్తమమైన నరజన్మను పొందడం జీవుని మొదటి యోగ్యతకాగా, 'పుంసత్వం' అనే గుణం అనుగ్రహింపబడడం రెండవ యోగ్యతగా

పరిగణింపబడుతుంది. ఆత్మజ్ఞానాన్ని పొందే అధికారాన్నే పుంసత్వం అంటారు. పుంసత్వం గల వ్యక్తి మరింత యోగ్యత కల్గినవాడైతే ఆతనికి 'విప్రత' అనే గుణం ప్రసాదింపబడుతుంది. విప్రత కల్గిన వ్యక్తి సత్వగుణ సంపన్నుడై ఉంటాడు.

పుంసత్వము మరియు విప్రతా గుణము కల్గిన మానవునకు మరింత సుకృతం కారణంగా వైదిక ధర్మమార్గపరత ప్రాప్తిస్తుంది. ఆతను వేద విహిత కర్మలను నిష్కామంగా ఆచరించడం, కర్మ ఫలాన్ని సన్యసించడం వంటి ఆచరణను చేపడతాడు. తద్వారా ఆతనికి చిత్తశుద్ధి మరియు చిత్త ఏకాగ్రత అలవడుతుంది. ఇటువంటి సాధకులకు మరింత సుకృతము తోడైతే "విద్వత్వం" అనే గుణం ప్రాప్తిస్తుంది. విద్వత్వం అంటే వేదశాస్త్రాది పాండిత్యం కల్గి ఉండడం అని అర్థం. ఉపనిషత్ వాక్య గూఢార్థములను బాగుగా ఎరిగిన సాధకుడే ఆత్మజ్ఞానమును పొందుటకు అర్హుడు. కావున విద్వత్వం లభించడం అత్యంత దుర్లభమని చెప్పబడినది. విద్వత్తుడైన సాధకునకు మరింత సుకృతము వలన మాత్రమే "ఆత్మానాత్మ వివేచన" కలుగునని శంకరుల ఉవాచ. ఆత్మ నుండి అనాత్మను వేరు పరచి చూడగలిగిన వివేకాన్ని పొందిన సాధకుడు "ఆత్మ జ్ఞానాన్ని" పొందగలడు.

ఆత్మజ్ఞానాన్ని పొందిన సాధకునకు మరింత పుణ్యవశమున "స్వానుభవము" సిద్ధిస్తుంది. అనగా ఆత్మజ్ఞానానుభవము కలుగుతుంది. స్వానుభవము బాగా దృఢమైనపుడు మాత్రమే ఆత్మను ఆత్మగా, అనాత్మ వస్తువును అనాత్మ వస్తువుగా గ్రహించగలరు.

స్వానుభవము కంటె "బ్రహ్మాత్మనా సంస్థితి" రూపమగు జీవన్ముక్తి అత్యంత దుర్లభము. ఈ స్థితిలో సాధకునకు జ్ఞాత, జ్ఞేయం, జ్ఞానం అను త్రిపుటి నశిస్తుంది. తనలోని ఆత్మ స్వరూపాన్ని ఆతను సర్వత్రా దర్శిస్తాడు. ఈ స్థితిలో ఉన్న సాధకుని "జీవన్ముక్తుడు" అని వ్యవహరిస్తారు. ఎన్నో కోట్ల

కొలది జన్మలలో చేసిన సుకృతముల ఫలితముగనే ఈ స్థితి లభించగలదని శ్రీ శంకరుల వారు బోధించుచున్నారు. జీవన్ముక్త దశకు చేరిన పురుషుడు జనన మరణాల గొలుసు నుండి విడివడి, ప్రారబ్ధము నశించినంతనే దేహమును చాలించి ఇక మరల జన్మింపడు. ఈవిధంగా జీవుడు జనన మరణాల గొలుసు నుండి విడివడి ఆ పరమపదాన్ని శాశ్వతంగా చేరుకోవడాన్ని విదేహముక్తి అంటారు.

సాధకులు తమను తాము ఆత్మ పరిశీలన చేసికొని తాము పై చెప్పబడిన 9 సోపానములలో ఏ స్థితిలో ఉన్నామో పరిశీలించుకుని పురుష ప్రయత్నముతో తదుపరి సోపానమును అధిరోహించుటకు పై శ్లోకము ఎంతగానో ఉపయోగపడగలదు.

ఆశ్రమ కంటి ఆసుపత్రి నిధికి త్రినేత్ర వైద్యాలయ ట్రస్టుకు
ఈ క్రింది వారు పైకం పంపినారు

1. జి.ఎస్.రామచంద్రన్ (మైలాపూర్, చెన్నై) - రూ.5,00,000/-
   (ఐదు లక్షల రూపాయలు)
2. వారి భార్య జి.కమలారామచంద్రన్ - రూ.5,00,000/-
   (ఐదు లక్షల రూపాయలు)
3. ఎ.కృష్ణారావు (కాకతీయనగర్,హైద్రాబాద్)- రూ.1,00,116/-
   (లక్షా నూట పదహారు రూపాయలు)
4. దుగ్గిరాల సత్యప్రకాశ్ (అడయార్,చెన్నై) - రూ.30,116/-
5. ఎం.శాంతమ్మ (పుదుప్పాక్కం,చెంగల్పట్టుజిల్లా) -రూ.25,000
6. ఎస్. ఆరతి (తిరుమలగిరి-సికింద్రాబాద్) - రూ.10,116/-

సద్గురు సేవా ట్రస్టుకు పైకం పంపినవారు

1.దుగ్గిరాల సత్యప్రకాశ్ (అడియార్, చెన్నై) - రూ.20,116/-

Scanned by CamScanner

మూలం: శ్రీ వ్యాసమహర్షి

ఉద్ధవ గీత

అనువాదం: యేలేశ్వరపు హనుమరామకృష్ణ

ధ్యాన యోగము

ఉద్ధవుడు : ఓ అరవిందాక్షా! శ్రీకృష్ణా! ముముక్షువులు నీ యొక్క ఏ రూపమును ఏ భావనతో ఏ విధంగా ధ్యానం చేస్తూ ఉన్నారో అది నా సాధనకొఱకై నాకు తెలియజేయ ప్రార్థన.

శ్రీకృష్ణుడు : శ్లో ॥ సమ ఆసన ఆసీనః సమకాయో యథాసుఖమ్ ।
హస్తావుత్యంగ ఆదాయ స్వనాసాగ్రకృతేక్షణః ॥
ప్రాణస్య శోధయేన్మార్గం పూరకుంభకరేచకైః ।
విపర్యయేణాపిశనై రభ్యసే న్నిర్జితేంద్రియః ॥

(భా.అ 14 శ్లో 32,33)

ధ్యానయోగ సాధకులు ఎత్తుగాని, పల్లం గాని కానటువంటి సమప్రదేశంలో సమమగు సుఖాసనాన్ని ఆశ్రయించి నిటారుగా కూర్చొని చేతులు ఒడిలో పెట్టుకొని దృష్టిని నాసాగ్రముపై సారించి రేచక, పూరక - కుంభకముల ద్వారా ప్రాణాన్ని (ప్రాణవాయువును) శోధించాలి. ఇంద్రియ జయం గలవారై మెల్లమెల్లగా అభ్యసించాలి.

ప్రాణాయామం ఇన్ద్రియజయయోగం కొరకై ఉద్దేశించబడింది. ఇన్ద్రియములను జయించాలి (లేక) ఇంద్రియ విషయములన్నింటినీ దాటివేసి మనోబుద్ధులను సమస్థితికి తేవాలి. పూరక - కుంభక- రేచక- వరుసలో గాని, రేచక-కుంభక-పూరక-వరుసలోగాని నెమ్మదినెమ్మదిగా... కాలం పెంచుకుంటూ అభ్యాసం చేయాలి! అప్పుడు క్రమక్రమంగా మనో-బుద్ధులు తమయొక్క దృశ్య సంబంధమైన సంస్కారాలను అధిగమించి క్రమక్రమంగా ఏకాగ్రత -మౌనము సంతరించుకోగలవు.

కుండలినీ శక్తిని అవిచ్ఛిన్నంగా కంఠ స్థానంలో లయింపజేయటం :

**శ్లో ॥ హృత్ అవిచ్ఛిన్నమ్ "ఓం" కారం ఘంటానాదమ్ బిసోర్ణవత్
ప్రాణేన ఉదీర్య తత్ర అథ పునః సంవేశయేత్ స్వరమ్. (అధ్యా 14,శ్లో 34)**

తామరతూడులోని దారం బీజాంకుర స్థానం నుండి -పుష్పము యొక్క అడుగుభాగం వరకు విస్తరించి యున్న తామరతూడు చివరస్థానం వరకు అవిచ్ఛిన్నంగా విస్తరించినదై ఉంటోంది కదా! ఆ విధంగా మూలాధార స్థానం నుండి హృదయస్థానం వరకు ప్రసరిస్తున్న (ఘంటానాదంతో పోల్చతగిన) నాదస్వరూప -ఓంకారమును మూలాధార స్థానము నుండి ప్రాణవాయువుతోసహా 12 అంగుళముల వరకు అవిచ్ఛిన్నముగా విస్తరింపజేస్తూ స్వరస్థానం (కంఠబిందువు, పంచదశ బిందువు) వరకూ విస్తరించి అక్కడ లయింపజేస్తూ వున్నారు-విజ్ఞులగు కుండలినీ ఉపాసకులు!

**శ్లో ॥ ఏవం ప్రణవ సంయుక్తం ప్రాణమేవ సమభ్యసేత్
దశకృత్వ స్త్రిషవణం మాసాదర్వాగ్జితానిలః (అధ్యా 14,శ్లో 35)**

1. ఆసన జయం -నాసాగ్ర స్థాన ధ్యానం
2. పూరక-కుంభకరేచకముల అభ్యాసం, రేచక-కుంభక-పూరకముల అభ్యాసం
3. ఓంకార రూపమగు ప్రాణముల కదలికకు కారణమయ్యే శక్తిని మూలాధారం నుండి -హృదయస్థానం ద్వారా- కంఠస్థానం వరకు నడిపించి, ఆ స్వరస్థానంలో ప్రతిక్షేపించటం, లయింపజేయటం.

ఈ విధానముల ద్వారా ప్రతీరోజు కనీసం 3 వేళల ఓంకారముతో కూడిన ప్రాణాయామమును అభ్యసిస్తూ వుండగా ఒక నెల కాలంలో ప్రాణవాయువు-ప్రాణశక్తి స్వాధీనం అవుతాయి.

హృత్ పుండరీక ధ్యానం- పరతత్త్వ ధ్యానము

హృదయంలో ఇష్టదైవ రూపాన్ని ప్రతిక్షేపించుకొని-పరమాత్మత్వంతో మమైకమయ్యే ఒకానొక మార్గమును ఉదహరిస్తున్నాను. విను.

శ్లో ॥ హృత్ పుండరీకమ్ అన్తఃస్థమ్ -ఊర్ధ్వనాలమ్ -అధోముఖమ్
ధ్యాయేదూర్ధ్వముఖమున్నిద్రమ్ అష్టపత్రం సకర్ణికమ్
కర్ణికాయాం న్యసేత్ సూర్య-సోమ-అగ్నీన్ ఉత్తరోత్తరమ్
వహ్నిమధ్యే స్మరేత్ రూపం మమ ఏతత్ ధ్యానమంగళమ్

(అధ్యా 14,శ్లో 36,37)

దేహమునకు అంతర్గతమై, ఊర్ధ్వనాళములు కలదై, ముకుళితమైన కర్ణికములతో కూడినదై 8 దళములు గల హృదయ పుండరీకమును ధ్యానం చేస్తూ వుండాలి. అట్టి హృదయము యొక్క కర్ణికలలో సూర్య చంద్రులను, అగ్ని యొక్క తేజస్సును భావన చేస్తూ వుండాలి. అట్టి తేజస్సులో మంగళ ప్రదమగు నా రూపమును ధ్యానం చేస్తూ ఉండాలి!

- సమము, ప్రశాంతము, సుముఖము, - చతుర్భుజములు గలది,
- చారుసుందరమైనది, - అందమైన నుదురుగలది,
- చిరునవ్వు చిందించేది,- రెండు చెవులు కుండలములు ధరించినది,
- బంగారు ఛాయగల పంచె ధరించినది, - నీల మేఘ ఛాయ దేహముగలది,
- శ్రీవత్సమణి ధరించిన హృదయ స్థానము కలది,
- శంఖ-చక్ర-గద-పద్మములను ధరించినది,
- విస్తారమైన -ఎత్తైన పాదములు గలది,
- కౌస్తుభమణి ధరించిన కంఠము గలది,
- కిరీటము మొదలైన ఆభరణములతో శోభిల్లునది,
- సర్వాంగ సుందరమైనది. - మనోహరమైనది,
- చల్లటి చూపులు ప్రసరిస్తున్న కళ్ళుగలది - అతి కోమలము....

అయినట్టి నాయొక్క భగవదవతారరూపమును హృదయంలో

మననం చేస్తూ వుండు. బుద్ధిమంతుడైనవాడు మనస్సును ఇంద్రియ విషయ ధ్యాసలనుండి ఉపసంహరించి, బుద్ధి అనే సారథి సహాయంతో చిత్తమును నాయొక్క వివిధాంగముల దర్శనాభ్యాసంలో నియమించుచున్నాడు! క్రమంగా అనేకచోట్ల ఉబుసుపోకగా విహరించే చిత్తమును నాయొక్క ఒక్కొక్క అవయవంపై ఏకాగ్రం చేస్తూ వస్తున్నాడు! అన్నిటికంటే చిరునవ్వులు చిందించే ముఖమండలముపై ధ్యాస నిలపటం సౌలభ్యముతో కూడిన అభ్యాసం- అని నా అభిప్రాయము.

క్రమంగా "అన్ని రూపములుగా, భావములుగా, స్వభావములుగా, గుణములుగా కనిపిస్తున్నది సర్వతత్త్వ, తత్త్వానంద స్వరూపుడగు పరమాత్మయే"...అనే నిశ్చయమును బుద్ధిచే ధ్యానం-ఆరాధనం- సందర్శనం ఒకేసారి అభ్యసిస్తూ ఉండాలి! గుర్తు చేసుకుంటూ మరల మరల మననం చేసుకుంటూ ఉండాలి!

అనగా... -1.మొట్టమొదట... "అనేక విషయములు ధ్యానించటము" అనే మనోరుగ్మతను **"ఇష్టదైవము- అవతారమూర్తి యొక్క ఒక్కొక్క అవయవ మననము"** అనే ఔషధం సేవిస్తూ....బుద్ధిని లౌకికమైన విషయములనుండి మరల్చాలి.

2. క్రమంగా అనేక అవయవముల ధ్యానం నుండి దృష్టిని మరల్చి **అవతారమూర్తి యొక్క చిరునవ్వుతో కూడిన ముఖమండలమును మాత్రమే ధ్యానించటం-** అను అభ్యాసమును ఆశ్రయించాలి.

3. ఆ తరువాత ముఖమండలమునుండి కూడా చిత్తమును ప్రత్యాకర్షింపజేస్తూ భూమి- జలము-అగ్ని-వాయువులకు ఉనికిస్థానమైన ఆకాశమునందు ప్రతిక్షేపిస్తూ అభ్యాసం కొనసాగించాలి. పరమాత్మ యొక్క ఆకాశతత్త్వాన్ని ఉపాసిస్తూ ఉండాలి.

4. ఆ తరువాత ఆకాశమునుండి కూడా చిత్తమును వెనుకకు మరలుస్తూ శుద్ధ బ్రహ్మస్వరూపమును సర్వదా సర్వముగా -సర్వాతీతంగా దర్శించే అభ్యాసమునకు ఉపక్రమించాలి. అనన్యధ్యానంతో సర్వ అన్యమైన ధ్యాసలను

Scanned by CamScanner

జయించి చిత్తమును లోకాతీతంగా-దృశ్యాతీతంగా-సమగ్రంగా, పూర్ణభావసమేతంగా తీర్చిదిద్దాలి.

నీవు,నేను, అది, ఇది, గుణములు, అంతఃకరణము అంతా పరమాత్మయే. చిత్తము చిత్ స్వరూపమై సర్వమును తనయందు దర్శించునట్లుగా "కృష్ణా! నీవు కానిదేదీ లేదయ్యా!" అను భావామృతమునుండి- కృష్ణ చైతన్యమునకు వేరైనదంటూ ఏదీలేదు. నేను కృష్ణచైతన్యమునే! నేను కానిదేది లేదు కదా! అను గానామృతమును ఆస్వాదించుగాక! సందర్శించునుగాక! తత్త్వమ్-సోహమ్ ఏకత్వమును పొంది పరిఢవిల్లును గాక! అట్టి సందర్శనముచే ఆతడు "సమాహిత చిత్తుడు" అని చెప్పబడుచున్నాడు! అట్టి సమాహితచిత్తుడు... ఒక జ్యోతి యందు మరొక జ్యోతివలె తనయందు సర్వసహజీవులను, ఈ జగత్తును పరమాత్మయందు, పరమాత్మయే జీవాత్మగాను సమదర్శనమును సర్వదా ఆస్వాదిస్తున్నాడు!

పరమాత్మలో జీవాత్మను, జీవాత్మను పరమాత్మగాను, జీవ బ్రహ్మైక్యము గాను, స్వస్వరూపమే సర్వస్వరూపంగాను, జీవాత్మకు కేవల సాక్షిగాను, తనను తాను -తనలో తాను -తానైన తనను దర్శిస్తాడు. ఆస్వాదిస్తాడు! "ఇదంతా నాలోని నేనైన నేనే!" అను అనుభూతితో పరవశిస్తాడు.

ఓ ఉద్ధవా ! ఈవిధంగా ధ్యానయోగం అను దైనందికమైన అభ్యాసం చేత పరమాత్మయగు నాయందే మనస్సును లగ్నం చేయి! క్రమంగా ద్రవ్య (Material), జ్ఞాన (Knowledge and thought related) - క్రియ (దేహ-మనో-బుద్ధిచర్యలు కదలికలు) అనే భ్రమలను త్యజించు! ఆధిభౌతిక - ఆధిదైవిక -ఆధ్యాత్మిక భ్రమలను నీ మనస్సు అధిగమించివేయును గాక! కర్మ-భక్తి-యోగ మార్గాలు 'అఖండాత్మత్వాహమ్" స్థానమునకే దారితీస్తున్నాయని గమనించు. త్రివిధ భ్రమలను త్యజించిన చిత్తము స్వయంగా -స్వభావ సిద్ధంగా పరమాత్మయగు నాయందు మమేకం కాగలదు! పరమాత్మవే అయి మత్తః పరతరం నాన్యత్ కకించిదస్తి అని సర్వము నీవై, సర్వసాక్షిగా అయి ప్రకాశించగలవు. నా స్థానమును చేరగలవు.

నాట్య నమిత్తుండుని కథ

- శ్రీమాతా గురుచరణానన్ద

భువిపై వెలసిన కాంచీపట్టణమందు నాట్య నిమిత్తుండను శివ భక్తుదుండెడివాడు. ఒక దినము యాతడు ఏకామ్రనాథ నిలయము చేరి అట వెలసిన తాండవేశ్వరుని జూచెను. జూచి మదిలో కుందసాగెను. కళవళము చెంది అర్చకుని జూచి "బ్రాహ్మణోత్తమా! ఈ శివుని శరీరము మూడు వంకరలు తిరిగియున్నదే! ముఖము వాడిపోయినది. శిరము ఓవైపు, చేతులు పైకి, ఓ కాలుపైకి, ఓ కాలు నేలపై, చేతులు రెండూ వంకర్లు తిరిగి యున్నాయి. జడలన్నీ చెదిరి అందవిహీనముగా యున్నవి. ఇదేదో సుఖాన్ని హరించే రోగంలా యున్నదే. ఓ శివార్చకుడా! నీవు జ్ఞానివి, వివరించు" మని యడిగెను. అంతనా అర్చకుడు ఇతడు మూఢమతియని తెల్లిసి వీనిని వంఛించాలనే ఉద్దేశము మనసులో యుంచుకొని "గిరిజాపతికి వాయురోగమున్నందువలన శరీరములో యున్న నరాలన్ని లాగబడినవి" యనిదెల్పెను.

నాట్య నమిత్తుండది విని బెదరిపోయెను. "హరుని రోగము నివారించు పండితుడెవరైనా యున్నారా! పిలిపించు"దని యనెను. అతనిని వంచించాలనే ఉద్దేశ్యముతో "ఓ భక్తుడా ఈ రోగమును నేనే పరిహరించగలను" అన్న మాటలకు సంతసించి "నాయావదాస్థిని నీ కర్పించెదను. మునుముందు ఈ రోగము స్వామికి సోకకుండా చూడు. ఔషధము తయారు చేసి శివుని రోగము బాపు. అలా చేసిన నేను, నా సతీసుతులు సంతసముతో నీ సేవ గావింతుము", యని పూజారిని ఒప్పించి ఇంటికి వెడలెను. యావదాస్థితిని ఓ తృణము కూడా మిగుల్చక అమ్మి ధనమును దెచ్చి అర్చకునకర్పించెను.

అర్చకుడు ఊరి బయటనున్న ప్రదేశమునకేగి ఎవరూ లేని స్థలములో చెట్ల ఆకులను, చిగురులను సమృద్ధిగా దెచ్చి వాటిని మెత్తగా పొడిచేసి కళాయిలో నూనెబోసి పొడిని అందు వైచి వాటిని బాగా మరగించి చల్లబరచి దానిని భరణి యందు నింపెను. దేవళమును సమీపించి మహాపండితునివోలె దేవుని యొక్క కళ్ళకు భస్మమును బూసెను. సోపు ఓ వస్త్రమునందుంచి శివునిపై ఒత్తుచుండెను. వాతరోగమునకిదియే మందని అట నిలచి గమనించుచున్న నాట్య నమిత్తుండునికి దెల్పెను. మరియు ఇది శీతవాతములను పారద్రోలు మూలికయని దానిని కాచి కషాయము జేసి తెచ్చితినని దానిని శివునిచే త్రాగించెదనని ఝూటము వెనుక జారవిడిచెను.

ఇవ్విధముగా రోజూ చికిత్స నెపముతో భస్మాన్ని పూస్తూ కాలాన్ని హరిస్తున్నాడేగాని శివుని శరీరము మొదలెట్లాగుండెనో అదేవిధంగా యుంది. మార్పు లేదు. ఇది గమనించిన నాట్య నమిత్తుండు అర్చకునితో "విప్రోత్తమా! ఔషధము వలన ఏ మాత్రము నయము కాలేదు. కారణమేమి"యని అడిగెను. "ఇది శీతాకాల రోగము. ఈ రోగమునకు కొన్ని భస్మములు తయారు చేయవలెను. నీవిచ్చిన ధనము ముందు తయారు చేయబడిన మందులకే సరిపోయెను. ఇక ఔషధములు తయారు చేయవలెనన్న నీవు ధనమిచ్చిననే చేయగలను" యనెను.

"అయ్యా! విప్రోత్తమా! ఉన్న సర్వస్వము అమ్మి మీకందించితిమి. ఇక మావద్ద ధనమెక్కడిది? దయచేసి ఉచితంగా చికిత్స చేయండి. నేను, నా భార్య, కుమారులు కూలినాలి చేసి సంపాదించి ఇత్తు'" మనెను. ఆవిధంగా యొసగిన ధనమును హరించి మూలికలచే ఏదో ఒక భస్మమును తయారు చేసి నటేశ్వరునకు నాట్య నమిత్తుండు చూచుచుండగా

ఉదర భాగమునకు శివుని క్రింది పెదవికి పూసెను. అదిగాంచి నమిత్తుండు శతకోటి వందనములర్పించెను. అయినా రోగము దారికి రాలేదు.

మోసగాడైన అర్చకుడు నమిత్తుండునితో నిట్టులనెను. "ఓ భక్తా! ఈ రోగము వైద్యమునకు లొంగడము లేదు" యనవిని "అయ్యయ్యో శివా, నీకిట్టి రోగము సంభవించెనా, ఎన్నో వ్యసనములతో నిండియున్న నిన్ను ఈ రోగము విడువలేదు. నీకు మరణమే, శరణ్యమా! ఇది నే సహించలేను. విగతజీవుడవైనచో నా కళ్ళతో నే జూడలేను. నీ కన్న ముందు నా ప్రాణములనర్పించెద"యని కత్తి చేతబట్టి జళిపించి శివుని ముందు సంతసముతో హరహరాయంచు శిరముపై కత్తి నాన్చుతరి శివుడు ప్రసన్నుడై యాకత్తిని పట్టుకొనెను.

కృపాసముద్రుడైన శివుడు అతని భక్తికి మెచ్చి "నీకు కావలసిన వరములు కోరు" యొసగెద ననెను. "ఓ దేవా! నీవొసగు వరములు అటుండనీ, నీ శరీరము వంకరలు తిరుగుటకు గల కారణమేమి? నీకు సంభవించిన అసాధ్యమైన రోగమేది? ఇది నీకెట్లు పరిహారమౌతుంది? నిజాన్ని నాకు తెలియబరచు"మని శివుని వేడెను.

"నమిత్తుండా! వినుము" నీ భక్తియే నాకు ఔషధము. నాకెటువంటి రోగము లేదు. నాకు నీ పూజ చాలాహితమైనది"యని శరీరాన్ని సమముగా చూపించెను. "నా స్వామికి వ్యాధి తొలగినది. నేను బ్రతికితినని హర్షానందము చెంది స్వామి పాదములపై వ్రాలెను. "స్వామీ! నీ శరీరము ఇంతకు మునుపు వంకరలుగా తిరిగి యుండుటకు గల కారణమేమి" తెలియబరుచుమనెను. "నాడు అంధకాసురునికి ముక్తి నొసగుటకై వాని ఎదపై భరతనాట్యమాడిన దృశ్యమే ఇది"

ఆశ్చర్య మనస్కుడైన నమిత్తుండయ్య స్వామీ! ఆ దృశ్యమును

Scanned by CamScanner

ఒక్కసారి చూడాలని మనసు ఉవ్విళ్ళూరుతున్నది. నాపై దయయుంచి చూపించండి" యని ప్రార్థించెను.

భక్తుని కోరికకు మెచ్చిన శివుడు తన భరతనాట్య భంగిమను చూపదొడగెను. ఒకవైపు బ్రహ్మ, మరొకవైపు దేవ గురువు మద్దెల,తాళము ధరించి మ్రోగించగా, హరుడు పులిచర్మాన్ని ధరించి, కాళ్ళకు గజ్జెలు కట్టి, చేతియందు ఢమరుకముతో నాట్యము సల్పుచుండగా విష్ణువు, మునులు, దేవతలు కరతాళ ధ్వనులు చేసిరి. ఆ నాట్యమునకు సముద్రములు పొంగినవి, పర్వతములు అల్లాడినవి, శేషుని శిరస్సు వంగినది. కూర్మడు కృంగెను. నక్షత్రములు రాలినవి, దేవతలు బెదరిపోయిరి. ఈ నాట్యాన్ని తిలకించిన నమిత్తుండు కనులుమూసి, బెదరిపోయి "స్వామి! నాట్యము నాపుచేయుడు" యని కోరిన భక్తుని మనసు నెరిగి ఆపివేసెను. అంతరిక్ష మందు దేవదుందుభులు మ్రోగెను. గంధర్వులు పూల వాన కురిపించిరి. శివుడు తన భక్తుని పుష్పరథముపై శివపురికి తీసుకెళ్ళెను.

'పాలలో వెన్న వుంది' అని గొంతు బొంగురుపోయేటట్లు ఎంత అరిచినా వెన్న చిక్కదు. వెన్న కావాలంటే పాలను తోడు పెట్టి పెరుగు చేసి బాగా చిలకాలి. అట్లే దేవుడు ప్రత్యక్షం కావాలి అని కోరుకునేవారు శ్రద్ధాభక్తులతో సాధన చేయాలి. అంతే కాని ఊరక 'దేవుడా! దేవుడా!' అని అరిస్తే ఏమి ప్రయోజనం?

చేపలను పట్టాలి అని అనుకొనేవారు ఇది వఱకు చేపలను పట్టినవారి వద్దకు పోయి చేపలు ఏ గుంటలో దొరుకుతాయి? వానిని పట్టడానికి ఎర ఏమి వేయాలి? ఈ మొదలైన విషయాలను తెలిసికొని గుంట వద్దకు పోయి గాలం వేసి, నేర్పుతో చేపలను పట్టును. అట్లే మహాత్ములగు సద్గురువుల కడకేగి,వారి యెడల పరిపూర్ణ విశ్వాసముంచి భగవత్ప్రాప్తికి ఉపాయాలను వారి నుండి తెలుసుకొని భక్తి అనే ఎరతోను, మనోనిశ్చయం అనే గాలంతోను దైవాన్ని సాక్షాత్కరించుకోవాలి. అందుకోసం అఖండమైన ఓర్పు కలిగివుండాలి. అనవరత సాధన చేయాలి.

– శ్రీరామ కృష్ణపరమహంస

సాధన యందు దీక్ష

– శ్రీరామకృష్ణ పరమహంస

జీవితం సఫలం కావాలంటే మానవునకు ఉత్సాహం, సాహసం, ధైర్యం ఉండాలి. పాలలో నానవేసిన మరమరాలవలె మెత్తగ, మత్తుగ పడియుండరాదు. ప్రయత్నపరులై, సాధనపరులై, దీక్షాబద్ధులై, చురుకుదనంగల గిత్తలవలె ఉత్సాహవంతంగా ఉండాలి. పెద్ద చేపను పట్టతలంచిన జాలరి నీటిలో గాలాన్ని వేసి గంటలకొద్ది కనిపెట్టుకొని యుండునట్లు, ఓర్పుతో, దీక్షతో సాధనలను చేస్తే భక్తుడు భగవంతుణ్ణి తప్పక గాంచగలడు (చూడగలడు).

ఈత నేర్చుకోదలచిన వాడు కొంతకాలం పట్టుదలతో దానిని గూర్చి ప్రయత్నం సలుపాలి. ఒక్కదినం సాధన చేసి వెంటనే సముద్రంలో ఈదులాడడం కోసరం ఎవరున్నూ సాహసింపరాదు. అట్లే సచ్చిదానంద సాగరంలో ఈదులాడదలంచినవారు ఎన్నో కష్ట నష్టాలకోర్చి అనేక సాధనలను చేయాల్సి వుంటుంది. వెదురు కట్టెల నిప్పును నిరంతరం ఊదుతూ వుండాలి. లేకుంటే అరిపోతుంది. ఆ ప్రకారంగానే ఆధ్యాత్మికాగ్నిని ప్రజ్వలింప చేయడానికి నిరంతర సాధన ఆవశ్యకము.

కూజాను నిండుగా నీటితో నింపి ఉట్టిమీద పెట్టే కొద్ది దినాలలో నీరంతా ఇంకిపోతుంది. కాని దానినే నీటిలో పెడ్తే. ఎంత కాలమైనా అట్లే నిండుగా ఉంటుంది. అదే విధంగా భక్తిసాధన కొద్ది కాలం చేసి తరువాత దానిని మరిచి ఇతర వ్యవహారాలలో దిగితే హృదయంలోని వున్న భక్తి ఆ రవంత కూడా హరించుకు పోతుంది.. అలా కాక హృదయాన్ని పవిత్ర భక్తి విశ్వాసాలనే అమృతసాగరంలో సదా ముంచివేస్తే దానితో సదా పరిపూర్ణమై ఒప్పుచుండును.

లోతులేని చెఱువు నుండి శుభ్రమైన జలాన్ని తీసికొని త్రాగాలనిన నీటిని కదలనీయకుండా, జాగ్రత్తగా, మెల్లగా పైభాగం నుండి తీసుకోవాలి. కలచి వేస్తే అడుగున వున్న బురద పైకి వచ్చి నీటినంతా మలినం (మురికి) చేస్తుంది. అట్లే నీవు పరిశుద్ధుడవు కావాలి అని తలిస్తే నీ శక్తి సామర్థ్యాలను నిరుపయోగాలైన చర్చలందు, వాగ్వివాదాలందు వ్యర్థం చేసుకోక, దృఢవిశ్వాసంతో క్రమంగా సాధనలను కొనసాగించాలి.

Scanned by CamScanner

అందరూ కోరేది...?

- కె. ఈశ్వర్

అందరూ అన్ని తరగతులవారు, అన్ని వర్ణములవారు, అన్ని రకాలవారు, అనునిత్యం, అనుక్షణం కోరేది, కోరుకునేది దుఃఖము రాకూడదని. ఇది సహజమైన కోరిక. అతిశయోక్తి కాని కోరిక. ఇట్టి చక్కటి కోరికను మాత్రము కోరుదురు కాని, దానికి తగిన ఏర్పాట్లు చేసుకొనుటకు బద్ధకించెదరు.

పాపముచే దుఃఖము, పుణ్యముచే సుఖము, జ్ఞానముచే మోక్షము కలుగునని పూజ్యులు శ్రీ గురుదేవులు పదే పదే నొక్కి వక్కాణించెడివారు. పాపకార్యాలు తప్పక చేస్తాముకానీ పాపఫలితమగు దుఃఖము మాత్రము వద్దంటారు. ఇది చట్టవ్యతిరేకము కాదా? నిప్పులో వేలు పెడతాము. కాని వేలు కాలకూడదంటే సాధ్యమా? దొంగతనము మాత్రము చేస్తాడు. కాని జైలుశిక్ష పడకుండవుండాలి అని దొంగ అనుకుంటాడు. నవ్వుతూ చేసిన ఏ పాపాన్నయినా ఏడుస్తూ అనుభవించవలసిందే.

"చేయి కాలితే మందుంది, చేసిన తప్పుకు లేదు బ్రదర్ "

అంటాడొక మహనీయుడు. ఒకవేళ తెలియక పొరపాటున తప్పు చేసినను దానిని మరల చేసి అలవాటుగ మలచుకొనకుండ పశ్చాత్తాపపడి, అట్టి తప్పును మరొకసారి చేయకుండ ఉండుటచే కొంతవరకైన బాగుపడుటకు అవకాశముండును.

శాంతి కావాలి - అశాంతి పోవాలి, దుఃఖం రాకూడదు-సుఖము రావాలి, నష్టము రాకూడదు-లాభము రావాలి. ఇవి ప్రతి మానవుని సహజమైన వాంఛితములు. కాని వీటికి తగిన వస్తుసామగ్రిని సమకూర్చుకొనుటలో కొందరు జాగ్రత్తపడుటలేదు. **అజాగ్రత్త కొంచెమైనను-కీడు అధికము.** చిన్న అజాగ్రత్తే కొండంత కీడుకు మూలము, కావున జాగ్రత్తగా వ్యవహరించాలి. అందరికీ కష్టనష్టాలు కలిగించి, అందరిని పీడించి, బాధించి, ఏడిపించి నీవు సాధించేది ఏమీలేదని గ్రహించుము. **చేతనైతే సహకరించుము- లేనిచో మౌనము వహించుము.** అంతియేగాని అనవసరమైన మాటలతో అన్యులను నొప్పించుటకు అమూల్యమైన కాలమును వృథా చేయవద్దని పెద్దలు పదేపదే చెప్పుచున్నారు. వారి మాటలపై విశ్వాసముంచి, వారు బోధించిన విజ్ఞాన సూత్రాలను, ధర్మసూత్రాలను అమలుపరచి, ఆచరించి, చరితార్థులమగుదాం.

గురుదేవుల ఆశీస్సులతో దుఃఖవిముక్తులగుదాం. ఇదే అందరూ కోరుకునేది. ఇది సాధించుటకే మానవజన్మను పొందినామని గుర్తుంచుకుందాం. అందులకు అవసరమైన వారి అందరి సహకారం పొందుదాం. అందరి దీవెనలతో ముందుకుపోదాం. **జయ్ శ్రీరామ వాసుదేవ జయ్ గురుదేవ**

అద్వితీయ జ్యోతిర్లింగ క్షేత్రం - శ్రీశైలం

- కపిలవాయి లింగమూర్తి

శ్రీశైలం ద్వాదశ జ్యోతిర్లింగాలలో రెండవది. ఇది నల్లమలయొక్క వాల ప్రదేశంపై సముద్ర మట్టానికి 1500 అడుగుల ఎత్తుపై వెలసింది. ఒకప్పుడీ క్షేత్రం ఒక స్వతంత్ర రాజ్యం. కాని నేడు కర్నూలు జిల్లాకు చెందింది.

నల్లమల అనే కొండల వరుస చిత్తూరు జిల్లాలో శేషాచలం పేర ప్రారంభమై కర్నూలుమీదుగా సాగి పాలమూరు జిల్లాలోని లచ్చంపేట తాలూకాలో అంతమయింది. ఈ కొండల వరుసకు తూర్పు కనుమలని మరో వ్యవహారం. పౌరాణికులీ పర్వత పంక్తిని అనంతుని రూపంగా భావిస్తారు. ఈ పంక్తిలో చాలా కొండలున్నవి. వానిలో ఒక్కొక్క దానికి ఒక్కొక్క చోట ఒక్కొక్క పేరుంది. వానిలో శ్రీశైలం గూడ ఒకటి. దాని ఉత్పత్తి వృత్తాంతం స్కాంద పురాణంలో ఈవిధంగా ఉంది.

పూర్వం ఒక మహర్షి శివుని గురించి కఠినమైన తపం చేసినాడు. తపం చేసేవారు మనవలె మామూలు ఆహారం తీసుకోరు. ఆకులు, కూరలు, నీళ్ళు, ఇంకా కఠిన నియమాలు పెట్టుకున్న వారు గాలి, పొగను కూడా ఆహారంగా తీసుకుంటారు. కాలయవనుని తండ్రి గర్గుడు లోహచూర్ణం ఆహారంగా తీసుకునే వాడట. అందుచేత అతనిని తక్కిన ఋషులు 'శిలాదుడ"ని వ్యవహరించినారు.

ఈ శిలాదునికి శివానుగ్రహం వలన నంది -పర్వతుడు అనే యిద్దరు కుమారులు కలిగి, వారు కూడ తండ్రి వలెనే శివుని గురించి గొప్ప తపస్సు చేసినారు. అపుడు శివుడు ప్రత్యక్షమై ఏమి కావలెనో అడగండి అనగా వారు అతనినే తమ శరీరంపై వెలయవలసిందిగా కోరినారు. అపుడు శివుడు "తథాస్తు" అని వరచిచ్చినాడు. అంత ఆ వరానికి తగినట్లు నంది వృషభ రూపంగా, పర్వతుడు గిరి రూపంగా మారగా శివుడు నందిని తన వాహనంగా చేసుకుని పర్వతుని యొక్క శిఖరంపై నివసించినాడు. ఇది వీరి కథ.

శివక్షేత్రాలన్నిటికి మకుటమైన ఈ శ్రీశైలానికి యుగయుగాల చరిత్ర ఉంది. అంతేకాక యిది దక్షిణ భారతానికంతా సంకల్పంలో దిక్నిర్ణయ కేంద్రంగా కూడా ఉంది.

Scanned by CamScanner

భక్తులు భగవదవతారాలకు తమ తమ ప్రాంతాలలో ఆలయాలు నిర్మించినట్లు పురాణ కర్తలు గూడ ఆయా కాలాలలో తమ తమ ప్రాంతాలలో దేవ దానవాదులకు కొన్ని స్థలాలను విహార భూములుగా, నివాసాలుగా చేసినారు. అటువంటి వానిలో ఈ శ్రీశైలం గూడ ఒకటి.

హిరణ్యకశిపుడు కృతయుగం నాటివాడు. ఉత్తరభారతం వారు అతని రాజధాని ఈనాడు "ఝూన్సీ కాన్పూరు" స్టేషనుల నడుమ గల "మోదా" స్టేషన్ సమీపంలోని "ఐరిచ్" పురమని, "కాపి" స్టేషన్ సమీపంలోని "నృసింహ టీలా" నృసింహావిర్భావ స్థలమని చెబితే, దక్షిణ భారతం వారు ఈనాటి "అహోబలం" ఆనాటి హిరణ్యాశిపుని పట్టణమని, "శ్రీశైలం" అతని పూజాగృహమని చెబుతారు.

నృసింహుడు స్తంభంలో ఆవిర్భవించి హిరణ్యకశిపుని గోళ్ళతో చీరినందుకు ఋషులతనిని "అహోబలం" అని స్తుతించినారట. అందుచేత ఆ స్థలం యిపుడు "అహోబలం" అని ప్రసిద్ధి చెందింది. అది కూడ ఇదే కొండల వరుసలో ఉంటుంది.

త్రేతాయుగంలో రావణ సంహారానంతరం శ్రీరాముడు సీతతో శివదర్శనానికై శ్రీశైలం వచ్చినాడు. అపుడతని రాక విని ఆయన తనను తాకి నమస్కరిస్తే ఆ బ్రహ్మహత్యా పాతకం తనకెక్కడ అంటుతుందోనని శంకించి శంకరుడు పాతాళానికి పయనమైనాడట. అపుడా వార్త మార్గమధ్యంలోనే శ్రీరామునికి తెలిసి ఆయన అక్కడి నుండియే ఒకపర్వత శిఖరాన్ని ఎక్కి చూచి పాతాళానికి వెళ్ళుతున్న శివుని ఆగమని కేక వేసినాడట.

అనంతరం దంపతులు సమీపానికి వెళ్ళి దర్శించి నమస్కరించిన పిమ్మట అక్కడ తమ పేర చెరొక సహస్ర లింగ ప్రతిష్ఠలు చేసినారు. ఇపుడవి అక్కడున్నవి. దీనికి నిదర్శనంగా ఈనాడు శ్రీశైలంలోని గర్భాలయంలో శివలింగం అన్ని జ్యోతిర్లింగాలవలె ఎత్తుగా ఉండక పాతాళానికి దిగిపోతున్నట్టుగా నేలపై పొట్టిగా ఉంటుంది.

ద్వాపర యుగంలో పాండవులరణ్యవాసంలో ఉన్నపుడు ఒకపుడీ స్వామి దర్శనానికి వచ్చినారు. అపుడు మార్గమధ్యంలో భీమునికి దాహం వేసి నీరు ఎక్కడా కనిపించకపోగా తన గదతో నేలను పొడిచి ఒక కొలను ఏర్పరచినాడు. అదిపుడు ఈ దారిలో ఉంది. అక్కడ నీరు త్రాగి సేద తీర్చుకుని యిక్కడికి వచ్చి పాండవులు శివుని దర్శించి తమ పేర శివలింగ ప్రతిష్ఠలు చేసినారు. అవి కూడా యిపుడక్కడ ఉన్నవి.

కలియుగారంభంలో మల్లికా పురాన్ని రాజధానిగా చేసికొని సోమ వంశీయుడైన చంద్రగుప్తుడు శ్రీశైల రాజ్యాన్ని పాలించినాడు. అతడొకపుడు ఏకధాటిగా పదహారేండ్లు విజయయాత్రలలో నిమగ్నుడై పట్టణం విడిచి వెళ్ళినాడు. అపుడతని భార్య శుకవాణి గర్భంతో ఉన్నది. ఆమెకు కూతురు కలిగింది. తల్లి ఆ పిల్ల అందచందాలు చూసి "చంద్రవతి" అని పేరు పెట్టింది. తండ్రి దండయాత్రలు ముగించుకుని ఇంటికి వచ్చేనాటికి చంద్రవతి "నవోఢ" అయింది.

అపుడిల్లు చేరిన తండ్రి ఆమెను చూచి కూతురని ఎందరు చెప్పినా వినక మోహపరవశుడైనాడు. అంత చంద్రవతికా వృత్తాంతం తెలిసింది. కామోన్మాదులు వావి వరుసలు గణించరు. కాబట్టి ఆమె తనకు కలుగగల ప్రమాదాన్ని శంకించి ఆనాటి రాత్రియే పట్టణం విడిచి శ్రీశైలం చేరి "కామారి"యైన పరమ శివుని మల్లికా పుష్పాలతో అర్చింపనారంభించింది.

చంద్రవతి యింటినుండి వెడలిన సంగతి తెలిసి తండ్రి ఆమెను వెదకుతూ వెదకుతూ శ్రీశైలం చేరి శివుని అర్చించే ఆమెను పట్టబోయినాడు. అపుడు మార్కండేయునికి వలె శివుడు శివలింగం నుండి ప్రత్యక్షమై చంద్రగుప్తుని పచ్చబండవై పాతాళ గంగలో పడిపొమ్మని శపించినాడు. అంత కన్నులు తిరిగి చంద్రగుప్తునికి తన దోషం తెలిసి వచ్చింది. పరమ శివుని పాదాలపై బడి శాప పరిహారం చెప్పమని ప్రార్థించినాడు. అపుడు శంకరుడు కరుణించి శ్రీమహావిష్ణువు కలియుగావసానంలో వీరభోగవసంతరాయుడై పుట్టి ఒకపుడిక్కడికి స్నానానికి వస్తాడు. అపుడతని దర్శనంతో నీకు ముక్తి కలుగుతుంది అని సెలవిచ్చినాడు. ఇపుడీ చంద్రగుప్తుని పట్టణ శిథిలాలు బ్రహ్మ గిరిపై ఉన్నవి.

శివుని శాపంతో అతడు అహల్యవలె శిలయై పాతాళ గంగలో పడిపోయినాడు. ఇపుడు చూపరులకు దూరానికి పాతాళ గంగ నీరు పచ్చగా పాకర వలె కనిపిస్తుంది. అది చంద్రగుప్తుడా నీటి అడుగున పచ్చబండయై పడి ఉండటం చేతనే అని జానపదులు విశ్వసిస్తారు.

చంద్రగుప్తుని ఆ విధంగా శపించి పిమ్మట శివుడు చంద్రవతిని ఏమి కావలెనో కోరుకోమని అడిగినాడు. అపుడామె నేను నిన్ను మల్లికా పుష్పాలతో అర్చించినందుకు ఆ చిహ్నంగా నేటి నుండి మల్లికార్జున నామం ధరించమని కోరింది. శివుడామె కోరిక నంగీకరించి నాటినుండి మల్లికార్జున నామం వహించి అక్కడ తనకు ఆలయ ప్రాకారాలు కట్టించమని కోరినాడు.

ఆనాడు చంద్రవతి ఆరాధించిన శివుడిపుడు కూడ వృద్ధ మల్లికార్జునుని

Scanned by CamScanner

పేర ఉన్నాడు. ప్రస్తుతం అక్కడ ఆలయానికి ఉన్న ప్రాకారం మొదట ఆమెనే కట్టించింది అని చారిత్రకులు విశ్వసిస్తారు. అది 20 అడుగుల ఎత్తు, 600 అడుగుల పొడవు ఉంది.

ఈ చంద్రవతి కథను పాల్కురికి సోమనాథుడు తన పండితారాధ్య చరిత్రలో చెప్పినాడు. ఈవిధంగా ఈ స్వామిని గురించి అన్ని యుగాలకు చెందిన వృత్తాంతాలెన్నో ఉన్నవి. అందుచేత యిది పురాణాలలో ఎంత పూర్వం నుండి నిలిచి ప్రసిద్ధిని పొందిందో చెప్పలేం.

శ్రీకోట వెంటాచలంగారు "అగ్ని వంశపు రాజులు" అనే తమ గ్రంథంలో ఇది క్రీ.పూ.377 నుండి 182 వరకు ప్రమర వంశీయులకు రాజధానిగా ఉన్నదని, అపుడు దీనికి "అంబావతి పట్టణం" అని వ్యవహారమని, విక్రమాదిత్య ప్రభువిక్కడనే పుట్టి పెరిగి క్రీ.పూ. 82లో శకులపై దండెత్తి ఓడించి తమ రాజధానిని మళ్ళీ పూర్వ పట్టణమైన "ఉజ్జయిని"కి మార్చినాడని చెప్పినాడు.

శాతవాహనుల కాలంలో దీనికి శ్రీ ధానమని పేరున్నది. అపుడిది వారి రాజ్యంలో ఉన్నది. వారి పిమ్మట వచ్చిన ఇక్ష్వాకులు తమను శ్రీపర్వతీయాంధ్రులమని చెప్పుకున్నారు. అంటే ఆనాటి వారి జన్మభూమి శ్రీశైల రాజ్యమే అని తలిచే అవకాశం ఉంది. ఆ వంశంలో రేండవ ప్రభువు వీరపురుషదత్తుడు. బౌద్ధాభిమానియై శైవాన్ని నిరసించినాడు. నాగార్జున సాగరపు త్రవ్వకాలలో ఒక ప్రభువు శివలింగాన్ని తన కాలితో త్రొక్కుతున్నట్టు, ఒక ప్రభువును ఏనుగుపై నుండి ప్రజలు క్రిందికి పడద్రోసినట్లు ఉన్న శిలాఫలకాలు లభించినవి. అవి పరిశోధకులు ఈ వీరపురుషదత్తునికే సంబంధించినవని గుర్తించినారు. ఆ ఫలకాలను బట్టి ఆ కాలంలో యిక్కడ శైవులకు, బౌద్ధులకు పెక్కు ఘర్షణలు జరిగినవని, ఆ కల్లోకంలో యిక్కడి మత సంస్కృతి చాలా నాశనమయిందని పరిశోధకుల అంచనా. చరిత్రలో ఈ వీర పురుషదత్తుని కాలం క్రీ.శ. 245 నుండి 265 వరకుగా గుర్తించబడింది. కాకతీయుల కాలంలో ఈ క్షేత్రం బాగా అభివృద్ధి దశలో వున్నది. గణపతి దేవ చక్రవర్తి శ్రీశైల మల్లికార్జునునికి ఏటేటా పన్నెండు వేల స్వర్ణ నాణేలు చెల్లించినాడు. ఆయన దౌహిత్రుడు ప్రతాపరుద్ర చక్రవర్తి శ్రీశైల ప్రాంతంలోని పెక్కు అరణ్యాలను కొట్టించి నూతన గ్రామాలేర్పరచి వానిని, తన "పట్టసాహిణికి" యిచ్చినాడు. తాను సతీసమేతంగా తులాభారం తూగి ఆ ధనాన్నంతా మల్లికార్జునునికి సమర్పించినాడు. అతని మంత్రి వేపేటి కొమ్మయగారు మల్లికార్జునస్వామి దేవాలయానికి కనక కలశాలెత్తించినాడు. ఇదే కాలంలో రాజమండ్రి నివాసి గంగమల్లిసెట్టి శిల్ప విరాజితమైన బలిపీఠం

కట్టించినాడు.

కాకతీయుల పిమ్మట శ్రీశైల రాజ్యాన్ని కొండవీటి నుండి పద్మనాయక వంశీయుడైన మాదానాయుడు జయించి తమ రాజ్యంలో కలుపుకుని పాతాళ గంగకు సోపాన పంక్తిని ప్రారంభించినాడు. పిమ్మట ఈ రాజ్యాన్ని అతని నుండి మొదటి బుక్కరాయలు జయించి విజయనగర రాజ్యంలో చేర్చుకున్నాడు. ఆయన కుమారుడు రెండవ హరిహరరాయలు. అతని భార్య విఠలాంబ కదంబ వంశ రాకుమారి. పాతాళ గంగకు మరికొన్ని మెట్లు కట్టించి ఆ దారిలో విఠలాలయాన్ని ప్రతిష్ఠించింది. పిదప హరిహరరాయలు ప్రాకారంయొక్క దక్షిణ ద్వార ముఖ మండపం విస్తృత పరిచి ఆ ద్వారంపై గోపురం కట్టించినాడు. దానికిపుడు రాయగోపురం అని పేరు. అనంతర కాలంలో ఇదే ద్వారానికి నాగిసెట్టి కొడుకు వీరయ్యగారు బంగారు రేకులు పొదిగించినాడు. ఇది వీర నరసింహరాయల కాలంలో జరిగింది.

సంగమ వంశీయుల నుండి రెండవ హరిహరరాయల పిమ్మట రెడ్డిరాజులు జయించి మళ్ళీ కొండవీటి రాజ్యంలో చేర్చుకున్నారు. ఆ వంశంలో ప్రోలయ వేమారెడ్డి మాదానాయుడు ప్రారంభించిన పాతాళ గంగ మార్గం యొక్క మెట్లదారిని చాలావరకు పూర్తి చేయించినాడు. ఇతని ఈ నిర్మాణం ఎఱ్ఱన గారి హరివంశంలో ప్రశంసింపబడింది. ప్రోలయ వేమారెడ్డి పిమ్మట ఆయన దత్త పుత్రుడు అన వేమారెడ్డి ఈ మెట్లు వరుసను పూర్తి చేసినాడు.

ఆలయం నుండి పాతాళ గంగ దాదాపు రెండు మైళ్ళ దూరం ఉంటుంది. ఈ దారిలో మొత్తం (900) తొమ్మిది వందల మెట్లున్నవి. (నేను ఆరు వందల మెట్ల వరకు చూచినాను) కాని కాలక్రమంలో చాలా భాగం శిథిలమై నేలలో కలిసినవి.

అన పోతారెడ్డి పిమ్మట ఆయన సోదరుడు అన వేమారెడ్డి యిక్కడ వీరశిరోమండపం కట్టించినాడు.

రెడ్డిరాజుల పిమ్మట కొండవీటి దండయాత్రలో రాయలు ఈ రాజ్యాన్ని మళ్ళీ జయించి విజయనగర రాజ్యంలో చేర్చుకున్నాడు. అంతేకాక రాయలు ఎంతటి విష్ణుభక్తుడో అంతటి శివ భక్తుడుగూడ. కాబట్టి ఆయన శ్రీశైలానికి వచ్చి మల్లికార్జునుని దర్శించి ప్రాకారం యొక్క తూర్పు ద్వారంపై ప్రస్తుతం వున్న గోపురం కట్టించినాడు. ఈ ద్వారానికి ఎదురుగా ఉన్న వీధికి రథ వీధి అని పేరు. ఈ వీధికి ప్రస్తుతం యిరువైపులా ఉన్న మండపాలు గూడ రాయలే కట్టించినాడు.

రాయలకాలం నాటికి ఈ మార్గం అంతా దారిదోపిడీగాండ్రతో నిండి ఉండేది. అది చూచి ఆయన ఈ దారి దొంగలను పట్టించి శిక్షించి మార్గం సురక్షితం చేసి మంత్రి చంద్రశేఖరామాత్యుని పాలకునిగా నియమించినాడు. రాయల కాలం తెలుగుదేశానికి స్వర్ణయుగం, అయితే ఈ చంద్రశేఖరామాత్యుని కాలం శ్రీశైల రాజ్యాధ్యాయంలో మరో స్వర్ణయుగం. ఆయన ఇక్కడ మల్లికార్జునస్వామికి కల్యాణ మండపం కట్టించి, స్వామి వారి కవచానికి బంగారు పూత పూయించినాడు.

దక్షిణ దేశం మహమ్మదీయాక్రాంతం అయిన కాలంలో శివాజీ మహారాజు ఔరంగజేబుకు వెరచి కొంతకాలం ఈ క్షేత్రంలో దాగినాడు. అపుడు భవాని ప్రత్యక్షమై స్వయంగా ఒక ఖడ్గాన్నిచ్చి అతనిని దేశ రక్షణకై పురి కొల్పింది. ఆ సమయంలో ఔరంగజేబు "శివాజీ"ని పట్టుకోవటానికి ఎంతో ప్రయత్నం చేసినాడు. అయితే అతని సోదరి "రోషనార" శివాజీ మహారాజును ప్రేమించి ఉండింది. కాబట్టి ఆమె అతనిని అన్నగారు గూఢచారుల కొరకు ఏర్పరచిన ఒక "గోపురం"గుర్తును చూపించి అతనిని సైనికుల బారినుండి రక్షించిందట. ఆ రక్షణ కార్యంలో తుదకామె అసువులు బాసింది. అనంతరం శివాజి ఆ గుర్తుగానే అక్కడ ఉత్తరద్వారంపై గోపురం కట్టించినాడంటారు. దీన్నిపుడు "శివాజీ గోపురం" అంటున్నారు.

ఈవిధంగా అక్కడి మల్లికార్జునస్వామికి ఎందరెందరో ఎన్నో సేవలు చెల్లించినారు. క్రీ.శ. 8వ శతాబ్దిలో జగద్గురువైన ఆది శంకరాచార్యులీ క్షేత్రంలోని పాలధార పంచధారలలో కొంతకాలం నివసించి తపస్సు చేసినాడు. అంతేకాక ఆయన శివానందలహరి గూడ యిక్కడనే రచించినాడట. ఆంధ్ర సాహిత్యంలో కుమారసంభవంలో ప్రసిద్ధిని పొందిన నన్నెచోడ మహాకవి గురువు జంగమ మల్లికార్జునుడు, శ్రీనాథుని కాలంలో భిక్షారాయుడు అనే మహనీయుడు, ఇంకా ఎందరెందరో యోగులు, మునులు అక్కడ నివసించి తపం చేస్తూ తమ జీవిత శేషాలు గడిపినారు.

ఈవిధంగా ఒకప్పుడు భూలోక కైలాసంగా విలసిల్లిన ఈ క్షేత్రం విదేశీయుల దండయాత్రల కాలంలో తన వైభవాన్ని కోల్పోయి అరణ్య ప్రాయమై నిలిచింది. క్రీ.శ. 1954 వరకు ఈ దారి దుర్గమారణ్యంగా ఉండి ఒక్క శివరాత్రికి మాత్రమే ప్రజలు గుంపులు గుంపులుగా వెళ్ళేవారు. అలా ఉండగా క్రీ.శ. 1954 నుండి దాని పునరుద్ధరణ ప్రారంభమై మొదట రోడ్డు పని ప్రారంభమయింది.

ఆధునిక యుగంలో ఏ ప్రదేశం అభివృద్ధి చెందవలెనన్నా దానికి రాకపోకల సౌకర్యం ముఖ్యం. అందుచేత అది ఏర్పడగానే అక్కడ యిక దేవాలయ పునరుద్ధరణ కమిటీ ఆరంభమై క్రీ.శ.1960 నుండి ఆలయం యొక్క ఖండస్ఫుటిత జీర్ణోద్ధరణ పని మొదలు పెట్టినారు.

ఇపుడు ప్రాత గోపురాలను కొత్త పరచటమే గాక పశ్చిమ ద్వారంపై గూడ గోపురం కట్టినారు. ఆలయాన్నంతా ప్రాతబడిన శిల్పాలన్ని మలిచి కొత్తదనం తెప్పించినారు. మరెన్నో నూతన ప్రతిష్ఠలు చేసి ఈనాటి హంగులన్ని కల్పించినారు.

శ్రీశైలం ఈనాడు భారతదేశంలోని అతి పెద్ద ఆలయాలలో ఒకటి. అక్కడికి దాదాపుగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్య పట్టణాలన్నిటి నుండి ఈనాడు నేరుగా బస్ సర్వీసులేర్పడినవి. యాత్రికులకు చక్కని అమరికలు గల వసతి గృహాలేర్పడినవి. ఇటీవల అక్కడ ఉచిత అన్నదాన సత్రం గూడ ప్రారంభింపబడింది. అదిగాక అక్కడ బ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, వైశ్య, వీరశైవ, వగైరా ధర్మసత్రాలు కూడా ఉన్నవి.

ఒకపుడు అరణ్య ప్రాయంగా ఉండి ఉత్సవ సందర్భంలో తప్ప తక్కిన వేళల్లో ఏదీ లేని ఆ ప్రదేశం యిపుడు నిత్యోత్సవాలతో పట్టణ శోభలతో సకల వస్తు సమృద్ధ స్థలం అయింది.

ఈ క్షేత్రానికి శ్రీశైల జల విద్యుత్తు ప్రాజెక్టు రావటం ఒక గొప్ప వెలుగు. దానితో ఆంధ్రదేశంయొక్క గ్రామాల స్థితి కూడ ఎంతో మారిపోయింది.

యాత్రీకులిక్కడ స్వామిని ధూళి దర్శనం చేసుకుంటారు. ధూళి దర్శనం అంటే బాటసారులు క్షేత్రానికి చేరిన పిమ్మట పాతాళ గంగా స్నానాది కృత్యాలు నిర్వర్తించుకోకున్నా సరే నేరుగా వెళ్ళి స్వామిని దర్శించవచ్చు. ఇది యిక్కడి ప్రత్యేకత. అంతేకాక యాత్రికులిక్కడ స్వామిని చేతితో తాకి తలకు "డిచ్చ" కొట్టుకుంటారు. ఈ ఆచారం మరే శివాలయంలోనూ లేదు. ఇక్కడ ఈ ఆచారాన్ని బసవేశ్వరుడు ప్రవేశపెట్టినాడంటారు. మల్లికార్జునుని ఆలయం వెనుక అమ్మవారైన భ్రమరాంబాదేవి గుడి ఉంటుంది. మల్లికార్జునాలయంలో వీరశైవులు, అమ్మవారి ఆలయంలో స్మార్తులు పూజారులుగా ఉన్నారు. ఇపుడు ప్రతి ఏటా శివరాత్రికి మహా వైభవంగా ఉత్సవం జరుగుతుంది. అంతేకాక భక్తులకోసం నిత్య కల్యాణం యొక్క ఏర్పాటు గూడ ఉంది.

Scanned by CamScanner

వార్తలు

(01). 5-01-2020 తేది ఆదివారం పూజ్యశ్రీ రమణమహర్షి జయన్తి శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరిగినది. శ్రీ విజయానంద బ్రహ్మచారి నేతృత్వంలో శ్రీరమణ మహర్షులవారి ఛాయా చిత్రానికి షోడశోపచార పూజ చేయబడినది. పరిసర భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజానంతరం అందరికి ప్రసాద వినియోగం చేయబడినది.

(02). (ఎ). 6-1-2020 తేది సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆశ్రమ శివాలయంలో ఆశ్రమ వాసులు, పరిసర భక్తులు కలసి విష్ణు సహస్రనామ సమిష్టి పారాయణ చేశారు. ఆపై గోవింద నామావళి పారాయణ, శివసహస్రనామ పారాయణ చేశారు. అందరికి అన్నప్రసాద వితరణ జరిగినది.

(బి). 7-01-2020 కృత్తికా నక్షత్రం నాడు ప్రదోషకాలంలో యథాప్రకారం ఆశ్రమ శివాలయంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి మూర్తికి అభిషేక అర్చనాదలు జరిగినవి.

(సి). 10-01-2020 తేది పూర్ణిమ సందర్భంగా అధిష్ఠాన మందిరంలో గురుపాదుకలకు షోడశోపచార పూర్వక పూజ జరిగినది. ప్రసాద వితరణ చేయబడినది.

(03). 17-01-2020వ తేది శుక్రవారం స్వామి వివేకానన్ద జయన్తి ఆశ్రమంలో జరుపబడినది. స్వామి వివేకానందుల ఛాయా చిత్రానికి విశేష పూజ చేయబడినది. తదనంతరం ఆశ్రమ పరివారానికి వస్త్రాలు ఇవ్వబడినవి. సాయంకాలం స్వామి వివేకానన్ద జీవిత విశేషాలపై సత్సంగములో పూజ్యశ్రీ సర్వాత్మానందగిరి స్వాములవారు ఉపన్యసించారు.

(4). 23-1-2020వ తేది గురువారం మాస శివరాత్రి సందర్భంగా ప్రదోష కాలంలో ఆశ్రమ నర్మదేశ్వర మహాదేవునకు రుద్రాభిషేకం, బిల్వార్చన జరిగినది.

(5). 24-1-2020 తేది తిరుపతి సమీపం శ్రీనివాస మంగాపురంలోని పూజ్యశ్రీ స్వస్వరూపానందగిరి స్వాములవారిచే స్థాపించబడిన శ్రీవసిష్ఠాశ్రమ 19వ వార్షికోత్సవంలో శ్రీవిద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొన్నారు.

(6). తెలంగాణా రాష్ట్రంలో నిర్మలజిల్లా, నిర్మలమండలం వెంకటాపుర్ గ్రామంలో ఆనంద బ్రహ్మనిష్ఠాశ్రమంలో నూతనంగా నిర్మించిన శివాలయ ప్రతిష్ఠ, ఫిబ్రవరి 8,9,10 తేదీలలో జరుగనున్నది. ఆ కార్యక్రమంలో పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు, పూజ్యశ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు పాల్గొందురు.

(07). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో 2019 డిశంబర్ నెలలో ఓ.పి. విభాగంలో **523** మందికి కంటి పరీక్షలు చేసి తగు చికిత్సలు చేశారు. **27**మందికి కళ్ళలో పొరలు తీసివేసి లెన్సు అమర్చబడినవి. **2** మందికి యాగ్ లేజర్ చికిత్స చేయబడినది. **4** గ్రామాలలో కళ్ళ వైద్య శిబిరాలు నిర్వహింపబడినవి.



త్రికూటేశ్వరుడు (కోటప్పకొండ)

Scanned by CamScanner

Regd.No. TRP / 123 / 2018 - 20 February 2020 Rs.10/- R.No.8139/63
Date of Publication 26-01-2020, Permitted to post : 29th, 30th every month.



ఈ పేజీ స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం

Scanned by CamScanner